

పాఠశాలలో ఘోరం

- శ్లాబ్ పైనుంచి కాంక్రీట్ ట్రాలీ పడి ఉపాధ్యాయురాలి మృతి
- పాయకరావుపేట మండలం రాజానగరంలో ఘటన

-వార్త మెయిన్‌లో



జ్యోత్స్నబాయి (ఫైల్)

అడుగుకో అతుకు.. గజానికో గొయ్యి!

జిల్లాలో అధ్వానంగా రహదారులు

ఆంధ్రజ్యోతి పరిశీలన

- తుఫాన్ వర్షాలతో పరిస్థితి మరింత దయనీయం
- రోడ్ల నిర్వహణను గాలికొదిలేసిన గత వైసీపీ ప్రభుత్వం
- ఒక్క ఏడాది కూడా నిధులివ్వని వైనం
- కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాది క్రితం తాత్కాలిక మరమ్మతులు
- వర్షాలతో మళ్లీ మొదటికొచ్చిన సమస్య
- వాహనదారులను వీడని వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం



రావికమతం వద్ద బీఎన్ రోడ్డు దుస్థితి

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

జిల్లాలో పలు రహదారులు అడుగడుగునా గోతులతో దర్శనమిస్తున్నాయి. ఈ ఏడాది ఆగస్టు నుంచి అక్టోబరు వరకు కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా ఆర్అండ్‌బీ, పీఆర్ శాఖల పరిధిలోని పలు రహదారులు మరింత ఛిద్రం అయ్యాయి. ప్రధానంగా బీఎన్ రోడ్డు, వడ్డాది-తాటిపర్తి, రావికమతం- ఈ.కన్నూరుపాలెం (ఆర్ఈసీ) రహదారులు దారుణంగా వున్నాయి. చెరువులను తలపిస్తున్న గోతులు, లేచిపోయిన రాళ్లు/కంకరతో వాహనదారుల ఇక్కట్లు వర్ణనాతీతం. రోడ్ల నిర్వహణ విషయంలో గత వైసీపీ ప్రభుత్వం ప్రదర్శించిన తీవ్ర నిర్లక్ష్యమే ఇందుకు కారణం. ఎంతలా అంటే.. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత గత ఏడాది నవంబరులో మరమ్మతులు చేసినా పెద్దగా ప్రయోజనం లేకపోయింది.

గత నెలలో సంభవించిన మొంథా తుఫాన్ సమయంలో కురిసిన భారీ వర్షాలతో ఆర్అండ్‌బీ శాఖకు చెందిన 366.92 కిలోమీటర్ల పొడవుగల రోడ్లు 79 చోట్ల పూర్తిగా దెబ్బతిన్నాయి. 13 కల్వర్టులు ధ్వంసం అయ్యాయి. అనకాపల్లి, చోడవరం, రావికమతం, మాడుగుల, సబ్బవరం, బుచ్చెయ్యపేట, ఎస్.రాయవరం, కశింకోట, కోటవురట్ల, తదితర మండలాల్లో రోడ్లు బాగా పాడయ్యాయి.

అధ్వాన రోడ్లలో మచ్చుకు కొన్ని....

- అనకాపల్లి నుంచి వెంకన్నపాలెం మీదుగా చోడవరం వెళ్లే రోడ్డు పలుచోట్ల గోతులతో దారుణంగా వుంది. వాస్తవంగా ఈ రోడ్డు అభివృద్ధి పనులను మూడు నెలల కిందట చేపట్టారు. అయితే అప్పటి నుంచి గత నెలాఖరు వరకు వర్షాలు పడుతుండడంతో పనులు ఆపేశారు.
- అనకాపల్లి నుంచి గాజువాక వెళ్లే జాతీయ రహదారిపై కొప్పాక వద్ద ఏలేరు కాలువ పొంగడంతో వరద ప్రవాహంతో బాగా దెబ్బతిన్నది.
- బీఎన్ రోడ్డులో చోడవరం మండలం వెంకన్నపాలెం నుంచి రోలుగుంట మండలం వెలంకాయలపాలెం వరకు రహదారి మొత్తం ఛిద్రమై భారీ గోతులతో దారుణంగా తయారైంది.
- వడ్డాది- పాడేరు ఆర్అండ్‌బీ రోడ్డులో వడ్డాది నుంచి మాడుగుల మండలం తాటిపర్తి వరకు 14 కిలోమీటర్ల మేర రహదారి దయనీయంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ రోడ్డు గురించి పట్టించుకోలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పనులు ప్రారంభమైనా నత్తనడకన సాగుతున్నాయి.
- రావికమతం నుంచి తట్టబంద మీదుగా కశింకోట మండలం ఈశ్వర కన్నూరుపాలెం వెళ్లే ఆర్ఈసీ రోడ్డులో పలు ... మిగతా 8వ పేజీలో



తాళ్లపాలెం వద్ద ఛిద్రమైన రహదారి



బీఎన్ రోడ్డులో గోవాడ వద్ద ఛిద్రమైన రహదారి

బీఎన్ రోడ్డులో నరక ప్రయాణం

ఇదే స్థితిలో వడ్డాది - పాడేరు ఆర్అండ్‌బీ రహదారి

- ఆరున్నరేళ్లుగా ఇక్కట్లు పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు

చోడవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చోడవరం నియోజకవర్గంలో పరిధిలో భీమిలి-నర్సీపట్నం (బీఎన్) రోడ్డు అత్యంత దారుణంగా వుంది. జిల్లాలో మరే ఇతర రహదారి ఇంత అధ్వానంగా లేదు. మూడు జిల్లాల ప్రజలు రాకపోకలు సాగించే బీఎన్ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. చోడవరం మండలం వెంకన్నపాలెం నుంచి బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల మీదుగా రోలుగుంట మండలం వరకు సుమారు 45 కిలోమీటర్ల మేర రహదారి పలుచోట్ల ఆనవాళ్లు లేదు. ఆరున్నరేళ్లుగా.. అంటే వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. ఈ రోడ్డు అభివృద్ధికి ఎన్‌డీబీ నిధులు రూ.110 కోట్లతో చేపట్టిన పనులు గత ప్రభుత్వ నిర్వాకంతో అర్ధంతరంగా నిలిచిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావచ్చినా అతీగతీ లేదు. వర్షాకాలం ముగిసినప్పటికీ రోడ్డు అభివృద్ధి పనుల్లో పెద్దగా పురోగతి లేదు.

ఇక వడ్డాది-పాడేరు రోడ్డులో వడ్డాది నుంచి మాడుగుల మండలం తాటిపర్తి వరకు 15 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ రహదారి దారుణంగా వుంది. ఈ రోడ్డు మీదుగా మూడు జిల్లాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఎంతో ప్రాధాన్యం వున్న ఈ రహదారిపై పలుచోట్ల భారీ గోతులు ఏర్పడ్డాయి. సరుకు రవాణా వాహనాల్లో గోతుల్లో కూరుకుపోవడం, బోల్తా పడడం వంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయి.

ఆనవాళ్లు లేని ఆర్ఈసీ రోడ్డు

రావికమతం నుంచి తోటకూరపాలెం వరకు పూర్తిగా ఛిద్రం

- గోతుల్లో కూరుకుపోతున్న వాహనాలు
- తరచూ స్తంభిస్తున్న ట్రాఫిక్
- ప్రయాణికులకు రోజూ కష్టాలే

రావికమతం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం రావికమతం నుంచి తట్టబంద, తోటకూరపాలెం మీదుగా కశింకోట మండలం ఈశ్వరకన్నూరుపాలెం (ఆర్ఈసీ) వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు దుస్థితి వర్ణనాతీతం. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారిపై రావికమతం, బుచ్చెయ్యపేట, మాకవరపాలెం మండలాలకు చెందిన సుమారు వంద గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. రెండు దశాబ్దాల క్రితం వరకు మెటల్ రోడ్డుగా వున్న ఈ రహదారిని తారు రోడ్డుగా అభివృద్ధి చేశారు. పంచాయతీరాజ్ శాఖకు నిర్వహణ భారంగా మారడంతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్అండ్‌బీ పరిధిలోకి తీసుకువచ్చారు. కానీ ఒక్కఏడాది కూడా మరమ్మతు, నిర్వహణ పనులు చేసిన పాపాన పోలేదు. గ్రానైట్ బండరాళ్లు, సరుగుడు లోడు లారీలు, క్వారీ టిప్పర్లు ఈ మార్గంలో ప్రయాణిస్తుండడంతో తీవ్రంగా దెబ్బతిన్నంది. కొన్నిచోట్ల తారు రోడ్డు ఆనవాళ్లు లేనంతగా ధ్వంసమైంది. ముఖ్యంగా రావికమతం సమీపంలోని దాసరయ్యపాలెం నుంచి తోటకూరపాలెం వరకు భారీ గోతులు ఏర్పడ్డాయి. వాహనాలు తరచూ వీటిల్లో కూరుకుపోయి ట్రాఫిక్ స్తంభిస్తున్నది. ఈ రోడ్డులో ఆర్టీసీ బస్సులను అధికారులు నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ఈసీ రోడ్డు దుస్థితిపై ఆర్అండ్‌బీ మాడుగుల సెక్షన్ జేఈ సాయిశ్రీనివాస్‌ను వివరణ కోరగా... ఈ రోడ్డు అభివృద్ధికి రూ.3 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.



రావికమతం మండలం దాసరయ్యపాలెం వద్ద గోతులమయమైన రోడ్డు

ఎకరాకు రూ.9 లక్షలు?

రాచపల్లి సాగుదారులకు నష్టపరిహారం

- కలెక్టర్‌కు చేరిన రైతుల జాబితా
- రెండు, మూడు రోజుల్లో గ్రామసభ
- అనంతరం రైతుల ఖాతాల్లో డబ్బులు జమ



రైతుల సాగులో ఉన్న కొండపోరంబోకు భూమి

మాకవరపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి రెవెన్యూ 737 సర్వే నంబరులో ఉన్న ప్రభుత్వ కొండపోరంబోకు భూముల సాగుదారులకు ఎకరాకు రూ.9 లక్షల చొప్పున పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. వారం రోజుల్లో రైతులతో నిర్వహించే గ్రామసభలో అధికారంగా వెల్లడించనున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగా శుక్రవారం సాగుదారులైన రైతుల జాబితాను జిల్లా కలెక్టర్‌కు అందజేసినట్టు సమాచారం. రాచపల్లి రెవెన్యూ 737 సర్వే నంబరులో వున్న కొండపోరంబోకు ... మిగతా 8వ పేజీలో

గంజాయి స్మగ్లర్ల బరితెగింపు

పోలీసుల నుంచి తప్పించుకోవడానికి వేగంగా కారు డ్రైవింగ్

- ఆటో, బైక్‌పైకి దూసుకెళ్లడంతో ఇద్దరికి గాయాలు
- విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగిన కారు
- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 240 కిలోల గంజాయి స్వాధీనం

చోడవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి స్మగ్లర్లు పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో కారును వేగంగా నడిపి, వాహనాలపైకి దూసుకెళ్లారు. ఈ ఘటనలో భార్యాభర్తలు త్రుటిలో ప్రాణాపాయం ... మిగతా 8వ పేజీలో



విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగిన కారు

కౌలు రైతుల నిరాశ

రెండో విడత కూడా అందని 'అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్' పథకాలు

- జిల్లాలో 80 వేల మందికిపైగా కౌలు రైతులు
- 6 వేల మందికి సీసీఆర్ కార్డులు ఇవ్వాలని అధికారులు నిర్ణయం
- ఇంతవరకు 4,987 మందికి మాత్రమే జారీ
- వీరిలో ఒక్కరికి కూడా అందని ప్రభుత్వ రాయితీలు, ఆర్థిక సాయం



వరి పొలంలో పనులు చేస్తున్న కౌలు రైతు కుటుంబీకులు (ఫైల్ ఫొటో)

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

కౌలు రైతులకు ప్రభుత్వ సాయం అందడం లేదు. ప్రతి ఏటా గుర్తింపు కార్డులను కొద్దిమంది కౌలు రైతులకు మాత్రమే జారీ చేస్తుండడంతో ప్రభుత్వ ఇచ్చే వివిధ రాయితీలు, ప్రోత్సాహకాలకు దూరమవుతున్నారు. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పెట్టుబడి సాయంగా 'అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల కింద అందించిన సొమ్ము కౌలు రైతులకు అందలేదు. వ్యవసాయ శాఖ అధికారుల గణాంకాల ప్రకారం జిల్లాలో సుమారు 80 వేల మంది కౌలు రైతులు వున్నారు. సొంత భూములు వున్న రైతులకంటే వ్యవసాయ ఖర్చులు వీరికే అధికంగా వుంటాయి. పంటల సాగుకు పెట్టుబడితోపాటు భూ యజమానికి కౌలు రూపంలో పండిన పంటలో కొంతభాగం లేదా నగదు చెల్లించాలి. ఇంటిల్లిపాదీ పొలంలో పనులు చేస్తున్నప్పటికీ చాలా మంది కౌలు రైతులకు కుటుంబ సభ్యుల శ్రమపాటు ఆదాయం కూడా మిగలడంలేదు. ఇటువంటి తరుణంలో కౌలు రైతులకు కూడా ప్రభుత్వ పరంగా రాయితీలు, ప్రోత్సాహకాలు అందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం 2019లో 'ఆంధ్రప్రదేశ్ క్రాప్ కల్టివేటర్ రైట్స్' అనే చట్టాన్ని తెచ్చింది. కౌలు రైతులందరికీ పంట సాగు హక్కు (సీసీఆర్) కార్డులు జారీ చేయాలి. ఇది వున్న కౌలు రైతులకు మాత్రమే ప్రభుత్వం నుంచి రాయితీలు, సంక్షేమ పథకాలు అందుతాయి. కానీ జిల్లాలో వాస్తవంగా వున్న కౌలు రైతులకు, అధికారులు ... మిగతా 8వ పేజీలో

భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి



అనకాపల్లి వద్ద శారదానదిలో దీపాలు వదులుతున్న భక్తులు

కార్తీక మాసం ముగిసి మార్గశిర మాసం ప్రవేశించడంతో తొలిరోజున పోలిపాడ్యమిని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో వున్న పుష్కరిణులు, సమీపంలోని చెరువులు, కాలువల వద్ద తెల్లవారుజామునే పూజలు చేసి, అరటి దొప్పల్లో నూనె ఒత్తులను వెలిగించి నీటిలో వదిలారు.

తాకట్టు బంగారంలో చిలక్కొట్టుడు!

చోడవరం కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకులో ఘరానా మోసం

- చిన్న చిన్న ముక్కలు తొలగింపు
- లబోదిబో మంటున్న ఖాతాదారులు

కనకమహాలక్ష్మి బ్యాంకు



చోడవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా చోడవరంలోని కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకులో ఘరానా మోసం వెలుగుచూసింది. ఖాతాదారులు తాకట్టుపెట్టిన బంగారం వస్తువుల్లో చిన్న చిన్న ముక్కలను సిబ్బంది కత్తిరించుకుంటున్న వైనం బయటపడింది. పట్టణానికి చెందిన వెలుగుల దొరబాబు తన భార్యకు చెందిన 60 గ్రాముల బరువు గల రెండు బంగారు నెక్లెస్‌లను కనకమహాలక్ష్మి బ్యాంకులో తాకట్టు పెట్టారు. రెండు రోజుల క్రితం బ్యాంకు నుంచి విడిపించుకున్నారు. అయితే తాము తాకట్టుపెట్టిన వస్తువులలో ముక్కలు తొలగించి ఉంచడాన్ని గమనించి స్థానిక నాయకుడు జయదేవ్ సహకారంతో బ్యాంకు అధికారులను గట్టిగా నిలదీశారు. దీంతో తప్పిదాన్ని గుర్తించిన బ్యాంకు అధికారులు, రెండు వస్తువులలో తగ్గిన రెండు గ్రాముల బంగారం ఆయనకు గురువారం తిరిగి ఇచ్చారు. మాజీ ప్రజా ప్రతినిధి సోదరుడు తాకట్టు పెట్టిన వస్తువులో కూడా కొంతమేర తగ్గడంతో, అధికారులను నిలదీయగా తిరిగి ఇచ్చేందుకు బ్యాంకు సిబ్బంది అంగీకరించారు. ప్రస్తుతానికి ఈ విధంగా ఎనిమిది మంది ఖాతాదారులు మోసపోయినట్టు తేలింది. ఇంకా బ్యాంకులో తాకట్టు పెట్టిన ఖాతాదారులు తమ బంగారాన్ని విడిపిస్తే, ఎవరెవరి వస్తువుల్లో ఎంత తగ్గిందో వెల్లడయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

బ్యాంకు అప్రైజర్ నిర్వాకమే

ఈ బ్యాంకులో బంగారం తనిఖీ చేసే అప్రైజర్ వెంకటేశ్, గతంలో పనిచేసిన బ్యాంకు అధికారి, కొందరు సిబ్బందితో కలిసి ఈ మోసానికి పాల్పడినట్టు చెబుతున్నారు. అయితే బ్యాంకు అప్రైజర్ చేసిన మోసం తెలిసినప్పటికీ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వకుండా, అతడిని ఇక్కడి నుంచి బదిలీ చేసి చేతులు దులుపుకోవడం గమనార్హం. కొత్తగా వచ్చిన అప్రైజర్ కూడా అతడి సోదరుడేనని అంటున్నారు. తాకట్టుపెట్టుకున్న బంగారాన్ని ఇలా ముక్కలుగా కత్తిరించి మోసగించిన వ్యవ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు ... మిగతా 8వ పేజీలో

1008 బిందెలతో కనకమ్మకు జలాభిషేకం

ధర్మవరంలో ఘనంగా మార్గశిర మాసోత్సవాలు ప్రారంభం


అమ్మవారి జలాభిషేకానికి హాజరైన భక్తజనం

ఎలమంచిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మార్గశిర మాసోత్సవాలు శుక్రవారం ప్రారంభమైన నేపథ్యంలో పట్టణంలోని ధర్మవరంలో గల కనకమహాలక్ష్మి ఆలయం కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహానికి 1008 బిందెలతో జలాభిషేకం చేయించారు. దీంతో వేకువజాము నుంచి ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో మహిళలు బారులు తీరారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబీకులు వర్రె నూకినాయుడు, సావిత్రి దంపతులు పసుపు, కుంకుమలతో తొలిపూజ చేసిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కొఠారు సాంబ, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గం

ఎలమంచిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏపీటీఎఫ్ మండల నూతన కమిటీని శుక్రవారం ఇక్కడ ఎన్నుకున్నారు. నూతన మండల శాఖ అధ్యక్షుడిగా ఎ.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.భూషణం, ఉపాధ్యక్షులుగా ఎం.సత్యనారాయణ, కేకే రామలక్ష్మి, పి.శ్రీనివాసరావు, కార్యదర్శులుగా వై.సత్యారావు, పి.అప్పారావు, ఎ.పాపారావు, కె.అమ్మాజీ, జిల్లా కౌన్సిలర్స్‌గా బి.సత్యనారాయణ, కె.వీరభద్రరరావు, జి.సర్వేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ఎన్ ధర్మారావు వ్యవహరించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు

ఎలమంచిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని పట్టణ ఎస్ఐ సావిత్రి, ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ సూచించారు. శుక్రవారం ఇక్కడి భాష్యం స్కూల్ ఆవరణలో నూతన చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ నుంచి రైల్వే స్టేషన్ రోడ్డు మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు.

విజయవంతంగా ముగిసిన సాగర్ కవచ్

అచ్యుతాపురం రూరల్, నవంబరు 21, (ఆంధ్రజ్యోతి) : పోలీసులు, మెరైన్ పోలీసులు, నేవీ, కస్టమ్స్, కోస్టు గార్డులు సంయుక్తంగా నిర్వహించే రెండు రోజుల సాగర్ కవచ్ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఏడాదికి రెండు సార్లు జరిగే ఈ మాక్‌డ్రిల్‌లో భాగంగా గురు, శుక్రవారాల్లో సాగర్ కవచ్ కార్యక్రమాలు నిర్వహించారు. సముద్ర తీరం గుండా ఉగ్రవాదులు వస్తున్నారనే సమాచారం అందుకున్న సాగర్ కవచ్ సభ్యులు అన్ని తీరాలను జల్లెడ పట్టి వారిని పట్టుకునే ప్రక్రియను కళ్లకు కట్టినట్టు చూపారు. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రశేఖరరావు, పూడిమడక మెరైన్ పోలీసు స్టేషన్ సీఐ సింహాద్రినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ సంతకాల సేకరణకు విశేష స్పందన : ధర్మశ్రీ

మునగపాక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వైద్య కళాశాలలు ప్రైవేటుపరం కాకుండా వైసీపీ చేపట్టిన సంతకాల సేకరణకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ తెలిపారు శుక్రవారం ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆలోచనలు తిప్పికొట్టే విధంగా సంతకాల సేకరణ జరిగిందన్నారు. వైసీపీ పార్లమెంట్ నియోజకవర్గం సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ వైద్య విద్య సామాన్యులకు దూరం కాకూడదన్నదే లక్ష్యమన్నారు. జెడ్పీటీసీ పెంటకోట స్వామిసత్యనారాయణ, షేక్ ఇస్మాయిల్, గణపతి అచ్చింనాయుడు పాల్గొన్నారు.

గుంతలమయం.. ప్రయాణాలు భయం

అధ్వానంగా బైపాస్ రోడ్డు ● రాళ్లు తేలడంతో తరచూ ప్రమాదాలు ● ఎలమంచిలి- అచ్యుతాపురం రూటులో మరీ దారుణం


నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద రాళ్లు తేలిన దృశ్యం


ఎలమంచిలి సమీపంలో గోతులమయంగా మారిన బైపాస్ రోడ్డు

ఎలమంచిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి బైపాస్ రోడ్డు వాహనదారులను భయపెడుతోంది. ఎక్కడికక్కడ రాళ్లు తేలి, గోతుల మయంగా మారడంతో ప్రయాణం అంటేనే హడలిపోతున్నారు. ఎలమంచిలి బైపాస్ రోడ్డు నుంచి అచ్యుతాపురం వెళ్లే వరకు దారిపొడవునా ఇదే మాదిరిగా దర్శనమిస్తోంది. ప్రతి రోజూ ఎలమంచిలి నుంచి అచ్యుతాపురం, రాంబిల్లి ప్రాంతాలకు వందల సంఖ్యలో బస్సులు, లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్డు దుస్థితి పట్టించుకోక పోవడంతో నేడు దారుణంగా తయారైంది. కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్ల దుస్థితి పూర్తిస్థాయిలో మెరుగు పడుతుందని, హాయిగా రాకపోకలు సాగించవచ్చునని భావించే వారికి నిరాశే ఎదురవుతోంది. గోతులు పడిన రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపడుతుండడం వల్ల నెలలు గడవక ముందే మళ్లీ యథాస్థితికి చేరుతున్నాయి. దీంతో తరచూ చిన్నచిన్న ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కేవ లం పనుల్లో నాణ్యత పాటించక పోవడం వల్లే ఈ దుస్థితి ఎదురవుతున్నట్టు స్థానికులు వాపోతున్నారు. అత్యంత ప్రమాదకరంగా ఉన్న ఈ రహదారిని అభివృద్ధి చేసేందుకు పాలకులు ప్రత్యేక దృష్టిసారించాలని అంతా కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ 'ప్రగడ'


వినతి పత్రాన్ని స్వీకరిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఇక్కడి టీడీపీ ప్రాంతీయ కార్యాలయంలో ధూళి రంగనాయకులు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు గొర్లె నానాజీ, ఇత్తంశెట్టి సన్యాసినాయుడులతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పలువురితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రగడ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అహర్నిశలూ శ్రమిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి అప్పారావు, నాయకులు ఆడారి రమణబాబు, కె.వెంకునాయుడు, కరణం రవి, గొర్లె బాబూరావు, కరెడ్ల వెంకట మల్లికార్జునరావు, దాడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా చిట్టిబాబు

కోలాహలంగా కార్యవర్గం బాధ్యతల స్వీకరణ


చైర్‌పర్సన్ చిట్టిబాబును అభినందిస్తున్న ప్రగడ తదితరులు

రాంబిల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా జడ్.చింతువా పంచాయతీ లోవపాలేనికి చెందిన ఎరిపల్లి చిట్టిబాబు, పర్సన్‌లుగా హరిపురానికి చెందిన మాజీ సర్పంచ్ ధూళి రమణ, భోగాపురానికి చెందిన ఉరిటి నానాజీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ముఖ్య అతిథిగా రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డెరెక్టర్ ధూళి రంగనాయకులు, టీడీపీ రాంబిల్లి మండల అధ్యక్షుడు లాలం భరత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రగడ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. సర్పంచ్‌గా, మత్స్యకార నేతగా, టీడీపీ నాయకుడిగా చిట్టిబాబుకు మంచిపేరు ఉండడంతో రాంబిల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా ప్రభుత్వం నియమించిందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా రైతులకు అదుబాటు ఉండాని సూచించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు, టీడీపీ రాంబిల్లి మండల తెలుగుయువత అధ్యక్షుడు ఎరిపల్లి అజయ్, బీజేపీ రాష్ట్ర నేత వర్మరాజు, బీజేపీ మండల అధ్యక్షుడు కారే రాముడు, క్లస్టర్ ఇన్‌చార్జి సేనాపతి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గవర్ల అనకాపల్లిలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం



మునగపాక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గవర్ల అనకాపల్లిలో గౌరీ పరమేశ్వరుల ఉత్స వం శనివారం జరగనుందని ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా గౌరీ సేవా సంఘం తోటాడ క్లస్టర్ అధ్యక్షుడు పొలమరశెట్టి ఆనందరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ పొలమరశెట్టి భాగేశ్వరరావు మాట్లాడుతూ నెహ్రూయాత్ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు సారె ఊరేగింపు, సాయంత్రం ఏడు గంటల నుంచి పలు రకాలు నేల వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో గౌరీపరమేశ్వరులు ఊరేగింపు ఉంటుం దన్నారు. అంతా విజయవంతం చేయాల్సిందిగా వారు కోరారు.

నేడు సీహెచ్‌సీలో బ్లడ్ స్టోరేజ్ యూనిట్ ప్రారంభం

ఎలమంచిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సీహెచ్‌సీలో శనివారం ఉదయం రక్త నిల్వ కేంద్రం (బ్లడ్ స్టోరేజ్ యూనిట్) ప్రారంభం కానుంది. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు ఆసుపత్రి వైద్యాధికారిణి డాక్టర్ నిహారిక తెలిపారు. ప్రజలు సౌకర్యార్థ ఈ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

'ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌పై అసత్య ప్రచారాలు తగదు'

అచ్యుతాపురం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌పై పలు మీడియా, పత్రికల్లో వస్తున్న ఆరోపణలు అసత్యమని, వాటిలో నిజం లేదని అచ్యుతాపురం ఇండస్ట్రీల అసోసియేషన్ అధ్యక్షులు ఎస్‌సీ నాయుడు, ఉపాధ్యక్షులు మన్నే ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. అచ్యుతాపురం పరిధిలో గల ఆయా కంపెనీలను, ప్రతినిధులను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నట్టు ప్రచారం చేయడం తగదని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి తమను గౌరవంగా పలకరించే వారే తప్ప, బలవంతపు వసూళ్లు, వేధింపులు వంటివి తెలియవని వివరించారు. ఇప్పటికైనా ఇటువంటి దుష్ప్రచారాన్ని ఆపాలని వారు హితవు పలికారు.

వీఆర్వోల నూతన కార్యవర్గాలు ఏకగ్రీవం

ఎలమంచిలి/అచ్యుతాపురం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోల మండల నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ఇక్కడ ఏకగ్రీవంగా జరిగింది. సంఘం అధ్యక్షుడిగా పి.మారేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పలకా పృధ్వీ, కార్యదర్శిగా టి. సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా కట్టమూరి సన్యాసిరావు, కోశాధికారిగా కె.లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే, అచ్యుతాపురం మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా పలివెల వెంకటరావు, ఉపాధ్యక్షుడిగా పొన్నాడ శ్రీనివాసరావు, కార్యదర్శిగా రాయవరపు సత్య, సహాయ కార్యదర్శిగా సీహెచ్.నాగమణి, కోశాధికారిగా పి.చిన్న అప్పారావులను ఎన్నుకున్నారు.

నక్కపల్లి గురుకులం బాలికల సత్తా

పలు విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన నక్కపల్లి గురుకులం బాలికలు

నక్కపల్లి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థినులు అండర్-14, అండర్-17, అండర్-19 హాకీ, రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ యు.ఉషారాణి, పీఈటీలు శశికళ, ఎస్.పద్మ శుక్రవారం తెలిపారు. ఈ నెల 22 నుంచి తిరుపతిలో జరగనున్న అండర్-14 రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో పి.ప్రసన్నకుమారి, కె.అస్మిత, నెల్లూరులో డిసెంబరు 3 నుంచి జరగనున్న అండర్-17 పోటీల్లో ఎస్.లాస్యకుమారి, కె.శాంతి, బి.రాణి, జెవిద్యావాసిని కుసమ ఎంపికైనట్టు చెప్పారు. నక్కపల్లిలో నేటి నుంచి జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్-19 బాలికల హాకీ పోటీల్లో పి.మేఘనాంజలి, బి.కృప ఎంపికైనట్టు చెప్పారు. ఈ బాలికలను శుక్రవారం ప్రిన్సిపాల్ ఉషారాణి, పీఈటీలు, ఉపాధ్యాయులు అభినందించారు.

నిరుపేదలకు వంట సామగ్రి పంపిణీ


ఆర్టీసీ బస్టాండ్ ఏరియాలో దుస్తులు, వంట సామగ్రి అందిస్తున్న దృశ్యం

పాయకరావుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సత్యసాయి శతవర్ష వేడుకల్లో శుక్రవారం నిరుపేదలకు వంట సామగ్రి పంపిణీ చేశారు. పెదరాంభద్రపురంలోని వృద్ధాశ్రమంలో భజన మండలి సభ్యులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వృద్ధులతో కేక్ కటింగ్ చేయించారు. అనంతరం వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అలాగే పాయకరావుపేటలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక ప్రాంతంలో పేదలకు దుస్తులు, దుప్పట్లు, వంట సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్ రమేశ్‌బాబు, సభ్యులు వై.శర్మ, రమణరాజు, లక్ష్మీపతిరాజు, జగన్నాథరాజు, శ్రీనివాస్, దోమాడ సుందరం, సూర్యనారాయణరాజు, సాయికుమారి, కమల, రాధా, దివ్య, ఈశ్వరి పాల్గొన్నారు.

స్వాముల భిక్ష దాతకు సన్మానం

ఎస్. రాయవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మేజరు పంచాయతీ తిమ్మాపురంలో నూకాంబిక ఆలయం వద్ద అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో 41 రోజులుగా నిర్వహిస్తున్న అయ్యప్ప, భవానీ, శివ మాలధారణ భక్తులకు మధ్యాహ్నం అన్నసంతర్పణ (భిక్ష)కు ఆర్థిక సాయం అందించిన జి.సత్యనారాయణ, భవానీ దంపతులను శుక్రవారం సన్మానించారు. స్వాముల భిక్షకు ఆర్థిక సాయం చేసిన టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం, నల్లపరాజు సీతారామరాజు, గుర్రం నానాజీ కూడా సత్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుర్రం రామకృష్ణ, మాజీ సర్పంచ్ వి.గోవింద్, జనసేన నేత ఎస్.సేనాపతి బాబూరావు, అయ్యప్ప సేవా సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం


బీకేపల్లిలో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, పారిశుధ్య కార్మికులు

కోటవురట్ల, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు, బీకేపల్లి సర్పంచ్ పెట్ల లింగం నాయుడు అన్నారు. మండలంలోని బీకేపల్లి, జల్లూరు గ్రామ పంచాయతీల్లో వివిధ గ్రామాలకు చెందిన పారిశుధ్య కార్మికులు, గ్రామస్థులకు పరిసరాలు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే గ్రామాల్లో పర్యటించి కాలువల్లో చెత్తాచెదారం తొలగించి పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా లింగంనాయుడు మాట్లాడుతూ కాలువల్లోని చెత్తాచెదారం నిల్వ లేకుండా చూడాలని, వాటిని ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే మురికి నీరు నిల్వ లేకుండా తగిన చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రతీ ఇంటి దగ్గర ఖాళీల్లో ప్రదేశాలు మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని ఆయన కోరారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని, వ్యక్తగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో కూర్మరావు, పంచాయతీ కార్యదర్శులు రఘురామ్, శ్రీనివాసరావు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు కృషిచేయాలి

పచ్చదనం-పరిశుభ్రత సదస్సులో ఎంపీడీవో విజయలక్ష్మి


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

పాయకరావుపేట రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య మెరుగుపర్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి కోరారు. మండలంలోని పి.ఎల్.పురం గ్రామంలో శుక్రవారం పచ్చదనం-పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చదనం-పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. గ్రామాలను పరిశుభ్రంగా, పచ్చదనంగా ఉంచుకోవాలన్నారు. మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. హరిత రాయబారులు గ్రామాలలో ఇంటింటి నుంచి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. పరిసరాలను, వీధులను కాలువలను ఎప్పటికపుడు శుభ్రం చేయాలన్నారు. తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలని, మొక్కలను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె.డేవిడ్, పంచాయతీ కార్యదర్శులు వై.వి.సత్యనారాయణ, శివరాం, కొండారావు, సర్పంచ్ పడాల దివాణం, మండలంలోని అన్ని పంచాయతీల హరిత రాయబారులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి


ఉపమాక పుష్కరిణిలో దీపాలు వదులుతున్న భక్తులు

నక్కపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నెల రోజులు దీక్షలు, పూజలు చేసిన మహిళలంతా శుక్రవారం ఉదయం పోలిపాడ్యమి దీపాలతో విరమించారు. నక్కపల్లి, ఉపమాక పరిసర గ్రామాల మహిళా భక్తులంతా తెల్లవారుజామునే ఉపమాకలో వున్న శ్రీస్వామివారి పుష్కరిణిలో అరటిడొప్పలపై దీపాలు వెలిగించారు. అనంతరం పుష్కరిణిలో వదిలారు. స్వామివారి బంధుర సరస్సు మహిళా భక్తులతో కిక్కిరిసిపోయింది. పోలిపాడ్యమి దీపాలు అనంతరం ఉపమాక శివాలయాన్ని దర్శించుకున్నారు. మండలంలోని గొడిచెర్ల శేష లింగేశ్వరస్వామి ఆలయం కూడా భక్తులతో కిక్కిరిసిపోయింది.

సుద్దముక్కపై క్రికెట్ పేరు

ధర్మవరం అగ్రహారం హైస్కూల్ విద్యార్థిని జయశ్రీ ప్రతిభ

ఎస్.రాయవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సుద్ద ముక్కపై క్రికెట్ చెక్కి ప్రతిభ చాటారు. పదో తరగతి చదువుతున్న బండి జయశ్రీ అనే విద్యార్థిని అంగుళం సైజు గల నర సుద్ద ముక్కపై క్రికెట్ అనే పేరు చెక్కి ఔరా అనిపించారు. విద్యార్థిని జయశ్రీ పిసీసును ఉపయోగించి సుద్ద ముక్కపై చిన్న సైజులో క్రికెట్ పేరు చెక్కారు. దీంతో పాఠశాల హెచ్ఎం ఎంఎస్ఎస్ ప్రశాంతి, ఉపాధ్యాయులు జయ శ్రీను తదితరులు అభినందించారు.



అంగుళం నర సుద్ద ముక్కపై క్రికెట్ పేరు దృశ్యం... (ఇన్‌సెట్‌లో) జయశ్రీ

శాప్ చైర్మన్‌ను కలిసిన క్రీడాకారుడు గణేశ్


శాప్ చైర్మన్ రవినాయుడుతో క్రీడాకారుడు గణేశ్

ఎస్.రాయవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోముదేవపల్లి గ్రామానికి చెందిన పారా వాలీబాల్ క్రీడాకారుడు దివ్యాంగుడు అన్నం గణేశ్ సాప్ చైర్మన్ అనిమిని రవినాయుడును కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు 12 నుంచి 18వ తేదీ వరకు అమెరికాలో జరిగిన సిట్టింగ్ వాలీబాల్ వరల్డ్ కప్ పోటీల్లో ఆడి వచ్చిన తాను గురువారం సాయంత్రం రాష్ట్ర పారా వాలీబాల్ అసోసియేషన్ బోర్డు మెంబర్స్ సమక్షంలో విజయవాడలో సాప్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా అమెరికాలో జరిగిన వరల్డ్ కప్ పోటీలకు సంబంధించిన విషయాలను రవినాయుడికి వివరించానన్నారు. పారా క్రీడాకారుల ప్రతిభను గుర్తించి అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రవినాయుడు చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పారా సిట్టింగ్ వాలీబాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బోడపాటి శివదత్తు పాల్గొన్నారు.

ముగిసిన వెలుగు సిబ్బంది శిక్షణ తరగతులు

నక్కపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నక్కపల్లిలో ఈ నెల 18న ప్రారంభమైన ఎనిమిది మండలాల వెలుగు సిబ్బందికి నిర్వహించిన శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. 2026-27 సంవత్సరానికి వార్షిక ప్రణాళికల తయారీపై వెలుగు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ, ఏపీఎం కల్యాణి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పాయకరావుపేట, చీడికాడ, రావికమతం, కశింకోట, రోలుగుంట, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాలకు చెందిన సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ నెల 25 నఉంచి 28 వరకూ అన్ని మండలాల్లో బడ్జెట్ తయారీపై శిక్షణ వుంటుందని డీపీఎం వెంకటరమణ చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలకు శిక్షణ

ఎస్.రాయవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడ గ్రామంలో శుక్రవారం క్లాప్ మిత్రలకు ఎంపీడీవో మీనాకుమారి, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులంతా పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సర్పంచ్ శ్రీనుబాబు మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ముఖ్య భూమిక వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎంత చేసినా తక్కువేనన్నారు. శిక్షణలో పాల్గొన్న క్లాప్ మిత్రలను గుడివాడతో పాటు లక్ష్మీపతి రాజుపేట, కొత్తపోలవరం గ్రామాలకు బృందాలుగా పంపించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండలంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


అనకాపల్లి ఉమా రామలింగేశ్వర ఆలయంలో భక్తుల దీపారాధన


పరవాడ : తాడి సమీపంలోని ఏలేరు కాలువలో దీపాలు వదులుతున్న భక్తులు

ఇంటింటా.. దీపకాంతులు

▸▸ ముగిసిన కార్తీక మాసం ▸▸ చివరి రోజు అత్యంత భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి వేడుక ▸▸ శైవక్షేత్రాలు కిటకిట

అనకాపల్లి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పోలిపాడ్యమిని అంతా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువనే నిద్రలేచి పుణ్యస్నానాలు ఆచరించి నదులు, చెరువులు, బావులు, నీళ్ల తొట్టెల్లో దీపాలను వెలిగించి శివకేశవులను పూజించారు. అనంతరం పోలి స్వర్గానికేగిన కథను విన్నారు. ఈ సందర్భంగా అనకాపల్లిలోని భోగలింగేశ్వర, సిద్ధిలింగేశ్వర, కాశీవిశ్వేశ్వర, ఉమా రామలింగేశ్వర, మార్కెట్ వద్ద గల శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ధ్వజస్తంభాల ఎదుట కార్తీక దీపారాధన జరిపారు. భోగలింగేశ్వరుని ఆలయంలో ఆలయ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) ప్రారంభించారు. ఇదిలావుండగా, తెల్లవారుజామున శారదానది ఒడ్డున గల ఉమారామలింగేశ్వరుని ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మహిళలు పెద్ద సంఖ్యలో దీపారాధన చేశారు. అరటి డొప్పలపై నూనె, నెయ్యి ఒత్తులతో దీపాలను వెలిగించి నదిలో వదిలారు. దీంతో ఘాట్ అంతా సందడిగా మారింది. అలాగే, ఉమా సమేత రామలింగేశ్వరస్వామిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ దర్శించుకున్నారు.

తుమ్మపాల : తుమ్మపాలలో వెలసిన పోతు లూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పోలి పాడ్యమి సందర్భంగా భక్తులు విశేష పూజలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్‌తో పాటు పెద్ద సం ఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


ఉమా రామలింగేశ్వర ఆలయంలో అభిషేకాలు చేస్తున్న అర్చకుడు

పరవాడ : మండల వ్యాప్తంగా శుక్రవారం పోలిపాడ్యమి వేడుకను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించి పూజలు చేశారు. అనంతరం అరటి డొప్పల్లో దీపాలను వెలిగించి నదులు, చెరువులు, నీటి తొట్టెల్లో విడిచిపెట్టారు. అనంతరం శివాలయాలకు వెళ్లి స్వామిని దర్శించుకుని, అర్చకులకు స్వయంపాకాన్ని దానంగా ఇచ్చి వారి ఆశీర్వచనాలను అందుకున్నారు. తాడి గ్రామం సమీపంలో గల ఏలేరు కాలువలో పెద్ద సంఖ్యలో భక్తులు దీపాలను విడిచిపెట్టారు.

గజానికో గండం.. ఈ రోడ్డుకో దండం

▸▸ అత్యంత దారుణంగా అసకపల్లి- లంకెలపాలెం రహదారి ▸▸ ఎక్కడికక్కడ తేలిన రాళ్లు ▸▸ ఆ మూడు కి.మీ. మరీ ఘోరం

సబ్బవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అసకపల్లి- లంకెలపాలెం రహదారి అత్యంత దారుణంగా తయారైంది. అసకపల్లి నుంచి పైడివాడ అగ్రహారం వరకూ మూడు కిలోమీటర్ల మేర ప్రయాణానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఈ రోడ్డులో అడుగుకో గుంత ఏర్పడింది. గతంలో ఏర్పడిన గుంతల్లో స్థానికులు గ్రావెల్ వేసి పూడ్చడంతో ఇటీవల కురిసిన వర్షాలకు అవి మరింత దర్భరంగా తయారయ్యాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు బూడిద, బుగ్గి ఎగసి పడుతుండడం మరిన్ని కష్టాలకు కారణమవుతున్నారు.

పరవాడ ఫార్మాసిటీ, ఎన్టీపీసీ నుంచి బూడిద, బొగ్గుతో భారీ వాహనాలు పరిమితికి మించిన లోడుతో రాకపోకలు సాగిస్తుండడం వల్లే రహదారి ఈ దుస్థితికి చేరిందని పలువురు ఆరోపిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ రోడ్డు ఛిద్రమైనా పట్టించుకునేవారు కరువయ్యారు. కూటమి అధికారంలోకి వచ్చాక గత జనవరి, ఫిబ్రవరిలో నెలల్లో లంకెలపాలెం నుంచి పెదముషిడివాడ రెవెన్యూ పరిధి వరకూ రోడ్డును బాగు చేసి వదిలేశారు. ఈ విషయమై జేఈ బాలరాజును వివరణ కోరగా, అసకపల్లి నుంచి పైడివాడఅగ్రహారం వరకూ మూడు కిలోమీటర్ల మేర మరమ్మ తులకు రూ.రెండు కోట్లు మంజూరైనట్టు చెప్పారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత పూర్తిస్థాయిలో రోడ్డుకు మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదు.


అసకపల్లి- లంకెలపాలెం మార్గంలో పైడివాడఅగ్రహారం వద్ద రోడ్డు దుస్థితి

వార్డుల్లో సమస్యలపై జీవీఎంసీ కమిషనర్‌కు వినతి

అనకాపల్లి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలోని 82, 83 వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని ఆయా కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మి కోరారు. ఈ మేరకు శుక్రవారం జీవీ ఎంసీ కమిషనర్‌ను వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు అందజేశారు. జోనల్ కార్యాలయం ఆవరణలో ఉన్న కంపోస్టుయార్డును తక్షణమే వేరొక చోటకు తరలించాలని కమిషనర్ కేతన్‌గార్గ్‌ను కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి కోరారు. కంపోస్టు యార్డు వల్ల పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. కార్పొరేటర్ సునీత మాట్లాడుతూ వార్డులో సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని వివరించారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన

సబ్బవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సీఐ జి. రామచంద్రరావు సూచించారు. ఇక్కడి డీఎంకే నర్సింగ్ కళాశాల విద్యార్థినులకు శుక్రవారం ఏర్పాటైన సదస్సులో మాట్లాడారు. బాలికలకు చట్టాలపై అవగాహన ఉంటే వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. సత్ప్రవర్తన కలిగిన వారు జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకుంటారని వివరించారు. మహిళలకు ప్రయాణాల్లో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే 100కు సమాచారమిస్తే పోలీసులు రక్షణ కల్పిస్తారన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

▸▸ అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే 'కొణతాల' ఆదేశం


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ఇక్కడి గుండాల జంక్షన్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అన్ని శాఖల అధికారులతో మాట్లాడి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించి, పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయిషా, ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్, జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, ఎలక్ట్రికల్ ఏఈ, వాటర్ వర్క్సు ఏఈ, పబ్లిక్ వర్క్సు ఏఈ, ఇన్‌చార్జి అధికారులు, హౌసింగ్ బోర్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సబ్బవరంలో ఎమ్మెల్యే 'పంచకర్ల' పర్యటన

సబ్బవరం : 'మన గ్రామానికి- మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా శనివారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సబ్బవరంలో పర్యటించనున్నారని జనసేన మండల అధ్యక్షుడు కర్రి కనకరాజు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు బోదివలస, పదకొండు గంటలకు ఎల్లుప్పి, మధ్యాహ్నం మూడు గంటలకు అయ్యన్నపాలెం, నాలుగున్నర గంటలకు వంగలి గ్రామంలో పర్యటించనున్నారన్నారు. గ్రామాల్లో సమస్యలను స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు ఆయన దృష్టికి తీసుకు వస్తే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

'అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం'


సీఎం, డిప్యూటీ సీఎంల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు

తుమ్మపాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని తెలుగు రైతు మండల అధ్యక్షుడు పీలా బుజ్జి పేర్కొన్నారు. రైతు భరోసాను విడుదల చేయడంతో తుమ్మపాలలో శుక్రవారం రైతులంతా కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి, ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, పాల సంఘం అధ్యక్షుడు చదరం కాశీ, జనసేన నాయకులు పీలా తాతు నాయుడు, నాయకులు రాపేటి రామ్‌కుమార్, కొణతాల రమణబాబు, నడిపల్లి బోసుబాబు, బొడ్డేడ రాము, కొణతాల మోదినాయుడు, పెతకంశెట్టి బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

▸▸ వైసీపీ పాలనలో రద్దయిన పింఛన్లు పునరుద్ధరణ

▸▸ గ్రీవెన్స్‌లో 'పీలా' ▸▸ పలువురి నుంచి వినతుల స్వీకరణ

తుమ్మపాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో వినతి పత్రాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. ఎన్నికల హామీలను శతశాతం నెరవేరుస్తున్నట్లు వివరించారు. ఈ మేరకు కశింకోట మండలం నుంచి పలువురు నాయకులు తెలియజేసిన సమస్యలను ఆలకించారు. ఏనుగుతుని గ్రామంలో విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని, స్మార్ట్ కార్డులు అందించాలని నాయకులువినతిపత్రాన్ని అందించారు. వైసీపీ పాలనలో రద్దయిన పింఛన్‌లను తిరిగి పునరుద్ధరిస్తామని పీలా హామీ ఇచ్చారు. అర్హులైన వారికి టిడ్కో గృహాలను మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, బొలిశెట్టి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న పీలా గోవింద సత్యనారాయణ

సోమలింగేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి చేయండి

▸▸ కమిటీ సభ్యులకు గండి బాబ్జీ సూచన


దేవాలయ కమిటీని అభినందిస్తున్న గండి బాబ్జీ

సబ్బవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగాలతిరుగుడులో గల స్వయంభూ సోమలింగేశ్వస్వామి ఆలయం అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ సూచించారు. నూతనంగా ఏర్పాటైన దేవస్థానం కమిటీ చైర్మన్, సభ్యులు శుక్రవారం మొగలిపురంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని బాబ్జీ అభినందించిన అనంతరం మాట్లాడారు. భక్తులకు మెరుగైన సేవలందించే బాధ్యత కమిటీ సభ్యులు అందరిపై ఉందన్నారు. ప్రభుత్వ పరంగా చేయాల్సిన పనులన్నీ పాలకులు చూసుకుంటారని, ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలు పెరిగేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. చైర్మన్ డీఆర్‌వీ సత్యనారాయణ, సర్పంచ్ దాడి లావణ్య, కన్నం నాయుడు, సభ్యులు దాడి శివ సత్యనారాయణ, రాపేటి శ్రీను, వల్లభజోష్యుల సీతారామ్మూర్తి, నాగిరెడ్డి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

అనకాపల్లి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన సిద్ధ ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రోటరీ క్లబ్, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో వెన్నుముక, మోకాళ్లు, మెడ, భుజాలు, కీళ్ల నొప్పులకు సంబంధించిన సమస్యల పరిష్కార మార్గాలను ఆయుర్వేద నిపుణులు చింతల జగదీష్, బీహెచ్.శ్రీనాథ్, స్వాతిలు చూపించారు. క్లబ్ అధ్యక్షులు బి.శ్రీనివాసరావు, కార్యదర్శి కె.వి.పి.ఎస్. ప్రకాశరావు, కోశాధికారి బి.సర్వారావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, గౌరీ సేవా సంఘం కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

26న అన్ని జిల్లాల్లో నిరసనలు : రైతు సంఘం

అనకాపల్లి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల్లో ఈ నెల 26వ తేదీన నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సంయుక్త కిసాన్‌మోర్చ ట్రేడ్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వీవీ శ్రీనివాసరావు శుక్రవారం ఇక్కడ మాట్లాడుతూ ఢిల్లీలో రైతు ఉద్యమం జరిగి ఆ రోజునాటికి ఐదేళ్లు అవుతుందన్నారు. కార్పొరేట్‌లకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాల రద్దు కోసం రైతాంగం సాధించిన పోరాటంగా పేర్కొన్నారు. మూడోసారి అధికారం చేపట్టిన ఎన్డీయే ప్రభుత్వం కార్పొరేట్‌లకు అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ ఏడాది ఎరువుల కొరతతో రైతాంగం ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలపై అన్ని జిల్లాల్లో సామూహిక నిరసన, ప్రదర్శనలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, కోశాధికారి గండి నాయనబాబు, సీఐటీయూ జిల్లా నాయకులు గంటా శ్రీరామ్, ఎం.రాజేష్, కె.తేలయ్యబాబు, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవ


ఊంజల్ సేవలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో శుక్రవారం రాత్రి గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రిలు విశేష పూజలు జరిపారు. మళ్ల అప్పలనాయుడు, ఇందిర దంపతులు, కుటుంబ సభ్యులు ఊంజల్ సేవ జరిపారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ప్రతినిధులు ఆలపించిన భక్తిగీతాలు, కోలా టాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ అధ్య క్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం అమలు అందరి బాధ్యత : జడ్సీ

అనకాపల్లి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలు జరిగేలా ప్రజలంతా సహకారం అందించాలని జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి కోరారు. శుక్రవారం ఆయన పలు వార్డుల్లో పర్యటించి ప్లాస్టిక్ సంచులకు బదులు గుడ్డ, నార సంచులు వినియోగించాలని సూచించారు. అలాగే, చినరామస్వామి ఆలయ పరిసరాల్లో పర్యటించి రెవెన్యూ కలెక్షన్స్, పారిశుధ్య నిర్వహణను పరిశీలించి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్ఐ పరదేశినాయుడు, శానిటేషన్ విభాగం ప్రతినిధి ఎం.అప్పారావు, సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ అధికారులు ఉన్నారు.

సంపద తయారీపై క్లాప్ మిత్రలకు శిక్షణ

కశింకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చెత్త నుంచి సంపద తయారు చేసే విధానాలపై క్లాప్ మిత్రలకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం తాళ్లపాలెం గ్రామ పంచాయతీలో ఏర్పాటైంది. ఈ సందర్భంగా ఎంపీడీవో సిహెచ్.చంద్రశేఖర్ హాజరై పలు సూచనలు చేశారు. పంచాయతీల్లో అభివృద్ధికి తోడ్పాటునిచ్చేలా సంపద కేంద్రాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో తోటారావు, పంచాయతీ కార్యదర్శులు ఎస్.సత్యారావు, జి.అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : గ్రామాల పరిశుభ్రతకు క్లాప్ మిత్రలు మరింత కృషి చేయాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి సూచించారు. మండలం లోని గుల్లేపల్లిలో శుక్రవారం పచ్చదనం- పరిశుభ్రతపై క్లాప్ మిత్రలకు ఏర్పాటైన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. ఎంపీడీవో పి.పద్మజ, సర్పంచ్ బండారు మంగ, కార్యదర్శులు పైడిరాజు, విష్ణుమూర్తి, గ్రామ పెద్దలు బోకం రామునాయుడు, బండారు శ్రీను, గజ్జి నర్సింగరావు పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా రవికుమార్


రవికుమార్

సబ్బవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు మొగలిపురానికి చెందిన గండి రవికుమార్ నియామకమయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్టు ఆయన తెలిపారు. శుక్రవారం పార్టీ నేతలు, మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాల నాయుడు, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, బొడ్డేడ ప్రసాద్, శోభా హైమావతి తదితరులు పదవి కట్టబెట్టినందుకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్తిస్థాయి ఆర్‌వోగా రమణ


ఆర్‌వోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాగేశ్వరరావు

అనకాపల్లి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా, ఇన్‌చార్జి ఆర్‌వోగా విధులు నిర్వహిస్తున్న కె.రమణకు పదోన్నతి కల్పిస్తూ పూర్తిస్థాయి రెవెన్యూ అధికారిగా జీవీఎంసీ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయనను కార్యాలయ ఉద్యోగులు కలిసి అభినందించారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి


జోగినాయుడు (ఫైల్)

పరవాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దేశపాత్రునిపాలెం మాజీ సర్పంచ్ అమరపిన్ని జోగినాయుడు (76) గుండెపోటుతో శుక్రవారం మృతిచెందారు. ఇతను 1985 నుంచి 90 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య ఇది వరకే కాలం చేశారు. జోగినాయుడు మృతదేహాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, పలువురు కూటమి నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

'కాలుష్యం, ఉపాధి సమస్యలకు త్వరలోనే పరిష్కారం'


విలేకరులతో మాట్లాడుతున్న కూటమి నాయకులు

పరవాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలాన్ని పట్టిపీడిస్తున్న కాలుష్య సమస్యకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చొరవతో తొందరలోనే పరిష్కారం లభించనుందని కూటమి నాయకులు వెల్లడించారు. ఇదే విషయమై వచ్చే నెల ఆరో తేదీన జిల్లా కలెక్టర్, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేల సమక్షంలో స్థానిక రాంకీ కమర్షియల్ హబ్‌లో సమావేశం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. శుక్రవారం రాత్రి ఇక్కడి జనసేన కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్యే పంచకర్ల మన పల్లెకి- మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటించారన్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, హిందూజా పరిశ్రమల్లో ఉపాధి, ఆయా పరిశ్రమల కారణంగా వెదజల్లుతున్న కాలుష్యం సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లడంతో పై విధంగా చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో జనసేన మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్, మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు కన్నూరు వెంకటరమణ, బొద్దపు శ్రీనివాసకాసులు, చింతకాయల ముత్యాలు, వియ్యపు చిన్న, నగిరెడ్డి చిన్నారావు, మోటూరి సన్యాసినాయుడు, వెలుగుల అనిల్‌కుమార్, కరణం నరసింగరావు పాల్గొన్నారు.

'మరుగుదొడ్ల వినియోగం పై చైతన్యపరచాలి'


గోడపత్రికను ఆవిష్కరించిన కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గృహ, సామూహిక మరుగుదొడ్ల వినియోగంపై గ్రామీణ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని జిల్లా గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అంతర్జాతీయ మరుగుదొడ్ల దినోత్సవ గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. అంతర్జాతీయ మరుగుదొడ్ల దినోత్సవాన్ని జిల్లాలోని అన్ని గ్రామాల్లో డిసెంబరు 10వ తేదీ వరకు నిర్వహించాలన్నారు. జిల్లా గ్రామీణ కార్యనిర్వాహక ఇంజినీర్ జె.అనిల్‌కుమార్, ఉప కార్య నిర్వాహక ఇంజినీర్ సావిత్రి, సిబ్బందిపాల్గొన్నారు.

దారెల పంచాయతీకి వైద్య నిపుణులు

▸▸ శిశు మరణాలపై విచారణ


శిశు మరణాలపై ఆరా తీస్తున్న ప్రత్యేక వైద్య నిపుణుల బృందం

ముంచంగిపుట్టు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దారెల పంచాయతీ పరిధిలో జరిగిన శిశు మరణాలకు గల కారణాలను విశ్లేషించేందుకు ఉమ్మడి విశాఖ జిల్లా రీజినల్ ట్రైనింగ్ సెంటర్ (ఆర్‌టీసీ) ప్రిన్సిపాల్ బండి సుజాత నేతృత్వంలో ప్రత్యేక వైద్య నిపుణుల బృందం శుక్రవారం పర్యటించింది. గత నెల రోజుల వ్యవధిలో ఈ పంచాయతీ పరిధిలో ఐదుగురు శిశువులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కలెక్టర్ దినేశ్‌కుమార్ సీరియస్‌గా తీసుకున్నారు. ఈ మరణాలకు కారణాలు, వారికి అందిన వైద్య సేవలపై పూర్తి స్థాయిలో విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సుజాతతో పాటు పీడియాట్రిక్ (చిన్నపిల్లల వైద్య నిపుణులు అల్లు ఉష, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ (డీఐవో) డాక్టర్ కమల, స్థానిక కిలగాడ వీహెచ్‌సీ డాక్టర్ అఖిల్ డి.కుమ్మరిపుట్టు, తలింబ, చీకుచింత గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను ప్రత్యేకంగా పరిశీలించారు. పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులతో వారు మాట్లాడారు. చిన్నారులు మృతి చెందడానికి గల పరిస్థితులపై లోతైన విచారణ చేపట్టారు. పిల్లలకు అందజేస్తున్న వైద్య సేవలు, వ్యాక్సినేషన్ ప్రక్రియలపై ఆరా తీశారు. ఇటు వంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆర్‌టీసీ పిమేల్ ప్రిన్సిపల్ సుజాత మాట్లాడుతూ శిశు మరణాలపై విచారణ చేపట్టామని, నివేదికను ఉన్నతస్థాయి అధికారులు అందిస్తామని చెప్పారు. అలాగే, పిల్లల ఆరోగ్య సంరక్షణపై జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. శ్వాస సంబంధిత, ఇతర ఆరోగ్య సమస్యలను గుర్తించి, అవసరమైన వైద్య సేవలు అందించనున్నట్టు చెప్పారు. వైద్యులు, వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారని, సమస్య వస్తే వారి దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. పిల్లల ఆరోగ్యంపై చిన్నపాటి నిర్లక్ష్యం కూడా వహించరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సొడపల్లు, ఏఎన్‌ఎంలు లక్ష్మి, గౌరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట


బి కొత్తూరులో పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దొరబాబు తదితరులు

కొయ్యూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధితోపాటు గిరిజన ప్రాంత వాసుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి తోట దొరబాబు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో ఆడాకుల పంచాయతీ బి. కొత్తూరులో ఏడబ్ల్యూఈ నిధులు రూ. 13.50 లక్షల వ్యయంతో మంజూరైన పాఠశాల భవన నిర్మాణాలకు స్కూల్ కమిటీ చైర్మన్ బొడ్డు దాలినాయుడు, కొయ్యూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ సుమర్ల సాంబశివతో కలసి దొరబాబు భూమిపూజ చేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ కె. జోగారావు, వార్డు సభ్యుడు లక్ష్మణ్ పార్టీ యనిట్ ఇన్‌చార్జి సత్తిబాబు, మాజీ సర్పంచ్ రాజబాబు, నేతలు కీర్తికుమార్, పండు పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్ స్ఫూర్తి ప్రదాత



మాట్లాడుతున్న మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ మహేశ్వరరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్

అరకులోయ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ స్ఫూర్తి ప్రదాత అని మేరా భారత్ డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల వద్ద శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా త్వరలో అరకులో ఐక్యతా యాత్రను నిర్వహించనున్నట్టు చేపడుతున్నామన్నారు. డిగ్రీ కళాశాల నుంచి గిరిజన మ్యూజియం వరకు ఐక్యతా ర్యాలీ కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, మై భారత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రముఖులు పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భరత్‌కుమార్‌నాయక్, ఎన్‌ఎస్‌ఎస్ పోగ్రామ్ అధికారి పి.నాగబాబు, అధ్యాపకులు విజయలక్ష్మి, లీలాప్రసాద్, పాల్గొన్నారు.

దుస్తులు, చెప్పులు వితరణ


గ్రామస్థులకు సామగ్రిని అందజేస్తున్న నాయకులు

అనంతగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల రొంపల్లి పంచాయతీ గూడెంలోని పాఠశాలకు సంబంధించిన సామగ్రితో పాటుగా గ్రామస్థులు,విద్యార్థులకు దుస్తులు, దుప్పట్లు, చెప్పులు తదితర వాటిని తెనాలికి చెందిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఓ వీరాభిమాని అందించారు. కూటమి నాయకులు ఆధ్వర్యంలో శుక్రవారం వీటిని గ్రామస్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షురాలు ఎస్.లక్ష్మి, రవి, దే ముడు, జనసేన నాయకులు కల్యాణ్, తిరుపతి, జగన్నాథం, అప్పన్నదొర, తదితరులు పాల్గొన్నారు.

సీలేరు పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారుల నియామకం

సీలేరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి ఎట్టకేల కు ఇద్దరు వైద్యులను నియమిస్తూ డీఎంఅండ్‌హెచ్‌ఓ కృష్ణమూర్తి నాయక్ ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్‌కే మస్తాన్‌వల్లీ, కె. సౌమ్య మూడు నెలల క్రితం బదిలీపై వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఈ పీహెచ్‌సీలో వైద్యాధికారులులేక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల విజ్ఞప్తుల మేరకు వి. అఖిల్, పి నారాయణరావు ఇద్దరు వైద్యాధికార్లను డిప్యూటేషన్‌పై నియమించారు. వీరు సోమవారం విధుల్లో చేరనున్నారు.

శక్తి యాప్‌పై అవగాహన


శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పాడేరురూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళలు తమ సంరక్షణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తి యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని స్థానిక మహిళా కానిస్టేబుల్ లీలావతి సూచించారు. శుక్రవారం ఆమె గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో పట్టణంలో ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించి మహిళలకు సెల్‌ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు.

చిన్నారులకు న్యూమోనియా పరీక్షలు


చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నిఖిల్

ముంచంగిపుట్టు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దారెల పంచాయతీ పరిధిలో కి లగాడ పీహెచ్‌సీ డాక్టర్ నిఖిల్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం కోడాపుట్టు, పోతునిపుట్టు, వర్దన్‌పుట్టు, పెద్దాపుట్టు, చీవుకుచింద తదితర గ్రామాల్లో పలువురికి వైద్య పరీక్షలు నిర్వమించారు. పంచాయతీలో గత నెల రోజుల వ్యవధిలో ఐదుగురు శిశువులు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన కలెక్టర్ ఎ.ఎస్.దినేశ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన మందులను అందిస్తున్నారు. ఆయా గ్రామాల్లో సుమారు 23 మంది చిన్నారులకు న్యూమోనియా పరీక్షలు నిర్వహించినట్టు డాక్టర్ చెప్పారు. న్యూమోనియా గుర్తింపుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కిలగాడ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ : ఏటీడబ్ల్యూవో


మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో నాగ శిరీష

జి.మాడుగుల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏటీడబ్ల్యూవో నాగ శిరీష అన్నారు. శుక్రవారం స్థానిక ఏపీటీడబ్ల్యూఆర్ పాఠశాలలో సత్వర ఆరోగ్యం, సంరక్షణ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ వేణుప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఏటీడబ్ల్యూవో మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పరిశీలించాలని, అనారోగ్య సమస్యలు గమనిస్తే వెంటనే ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించాలన్నారు. గృహాలకు వెళ్లిన విద్యార్థుల ఆరోగ్యాన్ని ఉపాధ్యాయులు మానటరింగ్ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారి ఇందిరా పాల్గొన్నారు.

మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి

సీలేరు, నవంబరు 21, (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధిలోని పీవీటీజీ గ్రామమైన రేలుగుంటలో మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఫాంగి నాగేశ్ కోరారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రేలుగుంటకు అంగన్‌వాడీ కేంద్రం సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉందని, అక్కడికి చిన్నారులు వెళ్లాలంటే చిన్నగంగవరం వాగు దాటాల్సి ఉంటుందన్నారు. గ్రామంలో 160 మంది జనాభా, 20 మంది పిల్లలు ఉన్నారని, మినీ అంగన్‌వాడీ ఏర్పాటు చేస్తే.. చిన్నారులకు పౌష్టికాహారం అందడంతోపాటు, ప్రీ స్కూల్, ఆటపాటలకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. మేరకు జిల్లా కలెక్టర్‌కు శుక్రవారం వినతి పత్రం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కిలో బలరామ్, డి జయరామ్ పాల్గొన్నారు.

రింతాడలో చందన దీక్ష రేపు

చింతపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గూడెంకొత్తవీధి మండలం రింతాడ గ్రామ పంచాయతీ కేంద్రంలో ఈనెల 23న చందనదీక్ష (నరసింహ దీక్ష) నిర్వహించనున్నట్టు నృసింహ దీక్ష ప్రచారకులు కశిరెడ్డి సురేంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా సింహాచలం వరహ లక్ష్మీ నరసింహా వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. పీవీటీజీలకు దుస్తులు పంపిణీ చేస్తామన్నారు. అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు. ప్రచారకులు సింహాద్రి మఠం, సింహాచలం పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్ల నియామకం


గుర్తింపు కార్డు అందిస్తున్న న్యాయమూర్తి భరణి

చింతపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రథమ శ్రేణి జుడీషియల్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం పరిధిలో ప్రజలకు న్యాయపరమైన సేవలందించేందుకు పారా లీగల్ వలంటీర్లు పనసల చిట్టిబాబు, కవడం కృష్ణ నియమితులయ్యారు. వీరు కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి మండలాల్లో న్యాయపరమైన సలహాలు, సూచనలు అందించనున్నారు. ఈమేరకు శుక్రవారం పారాలీగల్ వలంటీర్లకు న్యాయమూర్తి డి. భరణి గుర్తింపు కార్డులను జారీ చేశారు. వీరు స్వచ్ఛందంగా సేవలందించనున్నారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడికి ఘన సన్మానం


సాయిరామ్‌నకు సన్మానిస్తున్న నాయకులు

డుంబ్రిగుడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టిన కిల్లో సాయిరామ్‌నకు మండలంలోని కుంచుమండలోని టీడీపీ అరకు పార్లమెంట్ కోశాధికారి నాగేశ్వరరావు ఇంటి వద్ద శుక్రవారం ఘన సన్మానం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, సాయిరామ్ గిరిజన హక్కులు, చట్టాలపై పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మణుడు, ఎంపీటీసీ అర్జున్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


అద్దరవీధిలో శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

గూడెంకొత్తవీధి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అద్దరవీధిలో రూ.50లక్షలనిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం సర్పంచ్ కొర్ర సుభద్ర, కోఆప్టెడ్ సభ్యుడు షేక్ దావీదు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిషత్, పంచాయతీ నిధులతో జీకేవీధి పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పథకాల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబు, గుమ్మిరేవుల సర్పంచ్ కమల, వైసీపీ నాయకుడు అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలకు మట్టి రోడ్డు నిర్మాణం

డుంబ్రిగుడ,: మండలంలోని కంద్రుమ్ ప్రాథమిక పాఠశాలకు పంచాయతీ నిధులతో స్థానిక సర్పంచ్, మండల ఫోరం సర్పంచ్‌ల అధ్యక్షుడు హరి ఆధ్వర్యంలో గ్రామ పాఠశాలకు శుక్రవారం మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణంతో విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు తొలిగాయని తెలిపారు. విద్యా కమిటీ ప్రతాప్, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు పట్నాయక్, జగన్నాథ్, ప్రధానోపాధ్యాయుడు కొండబాబు, సూర్యనారాయణ పడాల్ పాల్గొన్నారు.

ములియగలుగులో శిశువు మృతిపై విచారణ


గ్రామంలో విచారణ చేపడుతున్న డీఎంహెచ్‌వోకృష్ణమూర్తినాయక్

అరకులోయ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదల పంచాయతీ ములియగలుగు గ్రామంలో గత రెండురోజుల కిందట బి. సంగీత, అప్పలరాజు దంపతుల నెలన్నర కుమార్తె మృతిచెందడంపై డీఎంహెచ్‌వో డి. కృష్ణమూర్తినాయక్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి బాలింతలు, శిశువులను ఆరోగ్య పరిస్థితిపై అడిగితెలుసుకున్నారు. న్యూమోనియ కేసులపై ముందుస్తుగా అవగాహన కల్పించాలని, ఐదేళ్లలోపు చిన్నారులు, వృద్ధులకు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో న్యు మోనియా వ్యాప్తిచెందే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ వ్యాధి లక్షణాలు జ్వరం, దగ్గు, శ్వాస తీసుకోవడం ఇబ్బంది, ఛాతినొప్పి, ఆయాసం, చిన్నపిల్లలకు మగత, ఆకలి లేకపోవడం వంటివి ఉంటాయని అవగాహన కల్పించారు. దీనిపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ వైద్యశిబిరాల ద్వారా వైద్యసేవలను అందించాలని ఆదేశించారు. విధి నిర్వహణలోని నిర్లక్ష్యం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. తొలుత గన్నెల, సుంకరమెట్ట పీహెచ్‌సీలను డీఎంహెచ్‌వో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, ఆయా పీహెచ్‌సీల పరిధిలోని రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్యాధికారులు జేకే నాయుడు, కే ఉపేంద్ర, ఎస్. ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సహకరించాలి


సీఐ సుధాకర్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ రామకృష్ణ, పెసా కమిటీ నాయకులు

గూడెంకొత్తవీధి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని స్థానిక సీఐ బొడ్డేపల్లి సుధాకర్ తెలిపారు. శుక్రవారం దామనాపల్లి సర్పంచ్ కుందరి రామకృష్ణ, వైసీపీ నాయకులు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. ఆదివాసీలు హెల్మెట్ ధరించకపోవడం, డ్రైవింగ్ లైసెన్సులేకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో వాహన చోదకులకు ప్రమాద నివారణ, ట్రాఫిక్ నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు అంజి, పెసా కమిటీ కార్యదర్శి సీదెరి కర్రయ్య పాల్గొన్నారు.

'కాంగ్రెస్ గెలుపే ధ్యేయం'


కాంగ్రెస్ పార్టీ సమావేశానికి హాజరైన పాడేరు నియోజక వర్గ నాయకులు

చింతపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు సాధించాలని పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు వంతల సుబ్బారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పాడేరు నియోజక వర్గంలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతపల్లి మండలంలో గత స్థానిక సంస్థల ఎన్నికల్లో రెండు ఎంపీటీసీ స్థానాలు, రెండు సర్పంచ్ స్థానాలు సొంతం చేసుకున్నామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. మాజీ చింతపల్లి ఎంపీపీ, వైసీపీ సీనియర్ నాయకుడు వంతల బాబురావు పార్టీలో చేరారన్నారు. ఈ పరిణామాలు పార్టీ పూర్వవైభవానికి సూచికలుగా కనిపిస్తున్నాయన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను సొంతం చేసుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు జీకే వీధి, చింతపల్లి మండలాల్లో సర్పంచ్ అభ్యర్థుల ఎంపిక పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వంతల బాబూరావు, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్లు గెమ్మెలి బొజ్జన్న, మొట్టడం బాలరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పాంగి గురుమూర్తి, నాయకులు పాంగి రామకృష్ణ, అప్పారావు, గుంట జున్ను, శ్రీనుబాబు పాల్గొన్నారు.

డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లకు చివరి గడువు నేడు

పాడేరురూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సర అడ్మిషన్లకు 22వ తేదీ శనివారం చివరి రోజు అని ప్రిన్సిపాల్ డాక్టర్. వనుము చిట్టబ్బాయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సర డిగ్రీలో కెమిస్ట్రీ 5, ఫిజిక్స్ 3, కంప్యూటర్ సైన్స్ 2 సీట్లు ఖాళీలు ఉన్నాయని, ఆసక్తిగల విద్యార్థులు శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోగా సంప్రదించి అడ్మిషన్‌లను పొందాలని ఆయన సూచించారు.

పోషకాహారంతో ఆరోగ్యం

జి.మాడుగుల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని వాసవ్య మహిళా మండలి ప్రాజెక్టు కోఆర్డినేటర్ రాంబాబు అన్నారు. శుక్రవారం కొక్కిరాపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు జీవిత నైపుణ్యాలపై అవగాహన కల్పించారన్నారు.శరీరంలో కలిగే మార్పులు, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. వార్డెన్ నూకరత్నం, వాసవ్య మండలి ప్రతినిధులు సుబ్బారావు, సంధ్య, సంగీత, సన్యాసమ్మ, మందకుమారి, రాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీట్లు కోల్పోవడం దారుణం: సీపీఎం

పాడేరురూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 2025-26లో 50 మెడికల్ సీట్లు కోల్పోవడం బాధాకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం ఆదివాసీ, వెనుకబడిన తరగతుల వైద్య విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందన్నారు. 2024-25లో కళాశాలలోఎన్ఎంసీ మొదటి దశలో 50 ఎంబీబీఎస్ సీట్లకు అనుమతిచ్చారు. మిగిలిన 100 సీట్లను 2025-26కు పెంచాలని అధికారులు ప్రతిపాదించారు. అయితే, ఈ ఏడాది ప్రక్రియలో అవసరమైన మౌలిక సదుపాయాలపై నివేదికలు, ఫ్యాకల్టీ సమయానికి ఎన్ఎంసీకి సమర్పించకపోవడంతో కళాశాలకు ఇవ్వాల్సిన 50 సీట్లను ఎన్ఎంసీ తిరస్కరించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఎంసీతో తక్షణమే చర్చలు జరిపి తిరిగి 50 సీట్లు వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వి.దాసు, ఎస్.చిట్టిబాబు పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రతలో క్లాప్ మిత్రలే కీలకం


చెత్త సంపద కేంద్రం వద్ద శిక్షణలో ఎంపీపీ రత్నకుమారి తదితరులు

పాడేరురూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం కల్పనపై మండలంలోని గ్రామ పంచాయతీల క్లాప్ మిత్రలకు మూడు రోజుల శిక్షణను విజయవంతంగా పూర్తి చేశామని ఈవోపీఆర్‌ఆర్‌డీ ఆర్‌వీఎస్.రమేశ్ తెలిపారు. 26 పంచాయతీల క్లాప్ మిత్రలకు మండలంలోని కిండంగి పంచాయతీ కేంద్రంలో ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకుశిక్షణ అదించామన్నారు. గ్రామంలో అన్ని వీధుల్లో ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్‌పై అవగాహన కల్పించడంతోపాటు, తడి పొడి చెత్త సేకరణ, చెత్త సంపద కేంద్రంలో తడిచెత్తతో వర్మీకంపోస్టు తయారీ తదితర అంశాలు వివరించామన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో హక్కులు, బీమా, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పవర్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.రత్నకుమారి, కిండంగి పంచాయతీ కార్యదర్శి కూడా శ్రీలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి జె.చంద్రశేఖర్, డివిజన్ డెవలప్‌మెంట్ అధికారి జయప్రకాష్, ఎంపీడీవో జె.తేజరతన్, ఈవోపీఆర్‌ఆర్‌డీ ఆర్‌వీఎస్.రమేశ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


రావణాపల్లిలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న అధికారులు

కొయ్యూరు: గ్రామాల్లో పారిశుధ్యపనులను క్రమం తప్పకుండా చేపట్టాలని స్థానిక ఎంపీడీవో జీడీవీ ప్రసాదరావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో రావణాపల్లి పంచాయతీ సంపద కేంద్రం వద్ద థీమ్-5 నిమిత్తం రోజూ క్లాప్‌మిత్రలతో సమీక్ష సమావేశంలో నిర్వహించారు. అనంతరం రావణాపల్లిలో పారిశుధ్య మెరుగు, చెత్త తొలగింపు రోజువారి చెత్త సేకరణలో పాటించాల్సిన పద్ధతులపై క్లాప్‌మిత్రలు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఏంపీడీవో నాయుడు, 33 పంచాయతీల కార్యదర్శులు, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.


పాడేరులో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


ముంచంగిపుట్టులో మత్స్యగెడ్డలో దీపాలతో భక్తులు

భక్తి శ్రద్ధలతో పోలి పాడ్యమి వేడుకలు

పాడేరురూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాడేరు పట్టణంలో శుక్రవారం మార్గశిర పోలిపాడ్యమిని భక్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున నదీ స్నానాలను ఆచరించి పట్టణంలోని అయ్యప్పస్వామి, ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయాలను దర్శించారు. అరటి డొప్పలలో దీపాలను గంగాదేవికి సమర్పించి ఆలయాల్లోని మహాలక్ష్మి పాటు వివిధ దేవతా మూర్తులకు భక్తి శ్రద్ధలతో పూజలను చేపట్టారు. మరికొంత మంది మహిళలు వంతాడపల్లి చెక్‌పోస్టు సమీపంలోని తోటల వద్దకు వెళ్లి ఉసిరిచెట్టుకు పూజలను నిర్వహించారు. గురువారంతో కార్తీక మాసం పూర్తి కావడంతో పోలి స్వర్గానికి వెళ్లే రోజు కావడంతో మహిళలు నదులు, చెరువు, బావులు దీపాలు వదిలారు. ఈ కాంతులే జీవితంలో అలుముకున్న చీకట్లను పారదోలి కాంతిమయం చేస్తాయని ప్రజలు విశ్వసిస్తుంటారు. అందుకే మహిళలు ఈ పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో చేపడతారు. అయ్యప్పస్వామి ఆలయంలోధర్మకర్త కొట్టగుల్లి సుబ్బారావు, ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద ధర్మకర్త కొట్టగుల్లి రమాదేవి పర్యవేక్షణలో కమిటీ ప్రతినిధులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.


సీలేరులో కార్తీక దీపాలు వెలిగిస్తున్న దృశ్యం

సీలేరు: సీలేరులో శుక్రవారం పోలిపాడ్యం పురస్కరించుకుని మహిళలు శివాలయం సమీపంలోని సీలేరు నది ఒడ్డున పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కార్తీక దీపాలను నదిలో వదిలారు. అనంతరం శివాలయానికి చేరుకుని పూజలను నిర్వహించారు. కార్తీక మాసం చివరి రోజు కావడంతో శివాలయం కిటకిటలాడింది.

ముంచంగిపుట్టు: మండలంలో పరిధిలో కార్తీక దీపోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున మహిళలు పెద్ద సంఖ్యలో మత్స్యగెడ్డ వద్దకు చేరుకుని స్నానాలు ఆచరించారు. కార్తీక దీపాలను నదిలో వదిలారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో మత్స్యగెడ్డ ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వనసమారాధన

సీలేరు: జీకేవీధి మండలం ధారకొండ ఘాట్ రోడ్డులోని ధారాలమ్మ అమ్మవారి చెంత ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్తీక వనసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ధారకొండ, గుమ్మిరేవుల, దుప్పులవాడలకు చెందిన 100 మందికి పైగా స్వయం సేవకులు పాల్గొన్నారు.


వన సమారాధనలో ఆర్ఎస్ఎస్ సభ్యులు

రహదారి ఛిద్రం.. రాకపోకలు నరకం!

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలకు అదో ప్రధాన మార్గం.. వేలాది మంది ప్రయాణానికి అదే ఆధారం.. అయినప్పటికీ ఏం లాభం..? రహదారి ఆద్యంతం గతుకుల మయం.. ఎక్కడికక్కడే పెచ్చులు ఊడిపోయి రాళ్లు తేలిపోయిన వైనం.. చినుకు పడితే 'దారు'ణాదిదారుణం... ఎన్నో ఏళ్లుగా పీడిస్తున్న 'దారి'ద్ర్యం.. అటుగా వెళ్లాలంటేనే భయానకం.. అయినా తప్పని గత్యంతరం.. ఇదీ వడ్డాది-పాడేరు రోడ్డులో ప్రయాణికులు, వాహన చోదకులు అనుభవిస్తున్న నరకం!

- వడ్డాది-పాడేరు ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానం
- ఆద్యంతం గతుకులు.. ఎక్కడికక్కడే తేలిన రాళ్లు
- వాహన చోదకులు, ప్రయాణికులు అగచాట్లు


డి.సురవరం వద్ద భారీ గతుకులో అధ్వానంగా తయారైన రోడ్డు


డి.సురవరం-సాగరం గ్రామాల మధ్య ఆనవాళ్లు కోల్పోయిన రహదారి

మాడుగుల రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చోడవరం నియోజకవర్గంలోని బుచ్చయ్యపేట మండలం వడ్డాది జంక్షన్ నుంచి మాడుగుల నియోజకవర్గ కేంద్రంలోని తాటిపర్తి గ్రామం వరకు ఉన్న రహదారి అధ్వానంగా తయారైంది. ఈ రహదారిని వడ్డాది-పాడేరు ఆర్‌అండ్‌బీ రోడ్డుగా పిలుస్తారు. విశాఖపట్నం, అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం పలు మైదాన ప్రాంతాల వారు, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు మన్యం ప్రాంతాల ప్రజలు రాకపోకలకు ఇదే ప్రధాన రహదారి. ఈ మార్గం మీదుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. వేలాది మంది ప్రజలు ప్రయాణాలు చేస్తున్నారు. వీరంతా రహదారి దుస్థితితో పడరాని పాట్లు పడుతున్నారు. సుమారు 14 కిలోమీటర్లు రహదారి గోతులు పడి దారుణంగా తయారు కావడంతో ఐదేళ్లుగా వారంతా ప్రత్యక్ష నరకం చూస్తున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చొరవతో ఎన్‌డీబీ నిధులు రూ.23.59 కోట్లతో గత ఏడాది డిసెంబరు 5న తారు రోడ్డు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జనవరిలో పనులు ప్రారంభించి ఏడు మీటర్లు మేర తారురోడ్డు వేసేందుకు వెడల్పు చేశారు. చాలా చోట్ల పాడైన పాతరోడ్డును తవ్వించి కంకర, వెట్‌మిక్స్ వేసి రోలింగ్ చేశారు. ఈ మార్గంలోని కేజేపురం జంక్షన్, ఎం.కోటపాడు వద్ద ముందుగా సీసీ రోడ్లు వేశారు. సుమారు 20శాతం పనులు పూర్తి చేశారు. అయితే బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణాల కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు ఆపేశాడు. ఈ క్రమంలో వర్షాలు, తుఫాన్ కారణంగా రోడ్డు మరింత దెబ్బతింది.

ప్రధానంగా ఈ రోడ్డు వడ్డాది జంక్షన్ నుంచి ముకుందపురం, కేజేపురం-ఎం.కోటపాడు మధ్య, డి.,సురవరం, సాగరం, ఎం.కోడూరు, కాశీపురం గ్రామాల వద్ద మరింత దారుణంగా తయారైంది. రోడ్డు ఆనవాలు కూడా లేకుండా ఛిద్రమైంది. కంకరరాళ్లు పైకి లేచిపోయాయి. వాహనాల రాకపోకలకు వాహనాల టైర్లు దెబ్బతింటున్నాయి. రోడ్డుపై దుమ్ము, ధూళి అవహించి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వడ్డాది జంక్షన్ నుంచి తాటిపర్తికి చేరుకునేందుకు సుమారు 45 నిమిషాల నుంచి గంట సమయం పడుతున్నది. వర్షాలు పడితే ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. గుంతలు రోడ్డుపై ప్రయాణం వల్ల ఒళ్లు హూనమవ్వడంతో పాటు వాహనాల విడిభాగాలు దెబ్బతింటున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ రహదారిని అభివృద్ధి చేయాలని వారు వేడుకుంటున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

రావికమతం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఎస్‌ఐ ఎం.రఘువర్మ చెప్పారు. మండలంలోని గర్నికం కస్తూర్బాగాంధీ విద్యాలయం, జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే మహిళలపై నేరాలు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి భాను తదితరులు పాల్గొన్నారు. అలాగే గుమ్మాళ్లపాడు పారమ్మ చెరువు వద్ద శుక్రవారం సిబ్బందితో కలసి ఎస్‌ఐ రఘువర్మ ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. రికార్డులు లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని వాహన చోదకులకు ఆయన సూచించారు.

సత్యసాయి బాబా శత జయంతి వేడుకలకు ఏర్పాట్లు

కె.కోటపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూండ్రపువానిపాలెం రామసత్యసాయి మందిరంలో సత్యసాయి బాబా శత జయంతి వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ వెలుగులతో మందిరాన్ని అలంకరించారు. ఉదయం ఐదు గంటల నుంచి పది గంటల వరకు ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, మంగళహారతి, 108 పర్యాయాలు సాయి గాయత్రి, నామ సంకీర్తన, ప్రశాంతి పతాకావిష్కరణ, జ్యోతి ప్రకాశనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు మహా నారాయణసేవ, సాయంత్రం ఆరున్నర గంటల నుంచి దీపాలంకరణ, నామ సంకీర్తన, ఊయల సేవ, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్ తదితరులు అతిథులుగా హాజరవుతారని సత్యసాయి సేవా సంస్థల జిల్లా సహ సమన్వయకర్త కె.అప్పలనాయుడు తెలిపారు.

పోలమాంబకు ప్రత్యేక పూజలు

కె.కోటపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి రోజు పోలిపాడ్యమి సందర్భంగా కె.కోటపాడులోని పోలమాంబ అమ్మవారికి శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంచినీటి కోనేరుకు ఆనుకొని ఉన్న ఆలయంలో మహిళలు పసుపు, కుంకుమలు, నైవేద్యాలతో అమ్మవారికి సారె సమర్పించారు.

గ్రామాల పరిశుభ్రతకు కృషి

రోలుగుంట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి క్లాప్ మిత్రలు కృషి చేయాలని ఎంపీడీవో నాగేశ్వరరావు సూచించారు. కొవ్వూరు సంపద తయారీ కేంద్రం వద్ద 24 పంచాయతీలకు చెందిన క్లాప్‌మిత్రలకు శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. రోడ్ల మీద చెత్త లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంటి ఆవరణ, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించడానికి కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో క్లాప్ మిత్రలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై అవగాహన

గొలుగొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగంపేట గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణపై కార్యదర్శులకు, క్లాప్‌మిత్రలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. చెత్తను తొలగించి ప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చి దిద్దేందుకుగాను ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. దీనిపై చెత్తను సేకరించి వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించేందుకు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు అప్పారావు, శ్రీనివాసరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

తాండవ కాలువపై ఆక్రమణల తొలగింపు

నాతవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నాతవరం తాండవ ఎడమ కాలువ దగ్గర ఇరిగేషన్ స్థలంలో ఉన్న ఆక్రమణలను పోలీసు బందోబస్తు నడుమ ఇరిగేషన్ అధికారి శ్యామ్ తదితరులు ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. నాతవరం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తాండవ కాలువపై ఆక్రమణలు తొలగించాలని స్పందనలో పిర్యాదు చేశారు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు ఆక్రమణలు తొలగిస్తుండగా, తాండవ కాలువకు దగ్గరల్లో 30 ఏళ్ల క్రితం ఇల్లు నిర్మించుకుని ఉంటున్నామని, ఇప్పుడు ఇళ్లను కూల్చివేస్తే ఎక్కడ నివాసం ఉండాలని అధికారులను బాధితులు ప్రశ్నించారు తాండవ ఎడమ కాలువకు రెండువైపులా అర కిలోమీటరు మేర ఇళ్లు ఉన్నప్పటికీ, ఒకవైపు మాత్రమే అధికారులు కూల్చివేస్తున్నారని ఇదెక్కడి న్యాయమని వీరు ప్రశ్నించారు. మొత్తం ఇళ్లు కూల్చివేస్తే కుటుంబంతో రొడ్డున ఉండాలని వారు కన్నీరుమున్నీరుగా విలపించారు.

స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నాతవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర నాయకులు అడిగర్ల సతీశ్ కోరారు. శుక్రవారం డి.యర్రవరం హైస్కూల్‌లో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పోటి పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటిరియల్ బీజేపీ మండల అధ్యక్షులు సబ్బీ కుమార్‌స్వామీతో కలసి అందజేశారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడుతూ మోడల్ పేపర్లను కూడా విద్యార్థులు క్షుణంగా చదవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎ.కుమారి పాల్గొన్నారు.

మాడుగులలో...

మాడుగుల రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. వీరనారాయణం హైస్కూల్‌లో 30, గాదిరాయిలో 14, ఒమ్మలిలో ఐదు, గొటివాడ అగ్రహారంలో 21 మొత్తంగా 70 మెటీరియల్ పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా అందించారు. ఒక పుస్తకం ధర రూ.300 ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు చేయూతనిచ్చే విధంగా స్టడీ మెటీరియల్ అందించిన వర్మ మాస్టారుని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఉమాశంకర్, బాబి, నాగేశ్వరరావు, అప్పారావు పాల్గొన్నారు.

బాలిక గుండె ఆపరేషన్‌కు రూ.5 లక్షలు


గుండె ఆపరేషన్ చేసిన షేక్ వహీదా బేగంతో ముస్లింలు, టీడీపీ నేతలు

గొలుగొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో చీడిగుమ్మల గ్రామానికి చెందిన గుండె ఆపరేషన్‌కు షేక్ వహీదా బేగంకు ఏపీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు సతీమణి పద్మావతి కృషితో ఐదులక్షల రూపాయలు మంజూరు చేశారు. దీంతో గత కొంతకాలంగా గుండె సమస్యతో బాధపడుతుండడంతో స్థానిక టీడీపీ నాయకులు కామిరెడ్డి గోవింద, బీమిరెడ్డి సత్యనారాయణతోపాటు పలువురు స్పీకర్ దృష్టికి తీసుకువెల్లారు. గుండె చికిత్స కోసం నగదు అవసరం కాగా టీటీడీ బోర్డు ద్వారా ఐదులక్షల రూపాయలు నిధులు మంజూరుకు అయ్యన్న సిఫార్సుతో ఈ చికిత్స జరిగిందని షేక్ వహీదా బేగం తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం అయ్యన్నపాత్రుడును కలిసి స్థానిక నాయకులు, కృతజ్ఞతలు తెలిపారు.

గ్రీన్ అంబాసీడర్లతో పారిశుధ్య పనులు


మర్రిపాలెంలో పారిశుధ్య పనులకు సన్నద్ధమవుతున్న గ్రీన్ అంబాసీడర్లు

నాతవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాలెం గ్రామంలో శుక్రవారం 31 పంచాయతీలకు చెందిన 80 మంది గ్రీన్ అంబాసీడర్లతో శుక్రవారం పారిశుధ్య పనులు ప్రారంభించారు. అన్ని వీధులను శుభ్రపరచుడమే కాకుండా మురుగు కాలువలల్లో చెత్తాచెదార తొలగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పంచాయతీల కార్యదర్శులు మర్రిపాలెం గ్రామంలోనే ఉండి ఎక్కడా చెత్తాచెదారం లేకుండా తగిన చర్యలు చేపట్టారు. అలాగే పారిశుధ్యంపై గ్రామస్థులతో అవగాహన సదస్సులు నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్య పనులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్టు ఎంపీడీవో సత్యశ్రీనివాసు తెలిపారు. ఈ కారయక్రమంలోదేశం పార్టీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, డిప్యూటీ ఎంపీడీవో మూర్తిబాబు, పంచాయతీ కార్యదర్శి బి.చిన్నోడు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే విశాఖ డెయిరీ లక్ష్యం


పాల సమీకరణ కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న డెయిరీ డైరెక్టర్

బుచ్చెయ్యపేట, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): పాడి రైతుల సంక్షేమమే విశాఖ డెయిరీ లక్ష్యమని డైరెక్టర్ గేదెల సత్యనారాయణ అన్నారు. పాత కొండెంపూడిలో రూ.5 లక్షలతో నిర్మిస్తున్న పాల సమీకరణ కేంద్రానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పాడి రైతుల కుటుంబాలకు విద్య, వైద్య, ఉద్యోగ సదుపాయాలు కల్పనే ధ్యేయంగా విశాఖ డెయిరీ పని చేస్తున్నదన్నారు. డెయిరీ చైర్మన్ ఆనంద్ కుమార్ అధ్వర్యంలో అనేక సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పాడి రైతులు డెయిరీ అందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే నాణ్యమైన పాలు సరఫరా చేయాలని సూచించారు. సర్పంచ్ ఆది సత్తిబాబు, పాల సంఘం అధ్యక్షులు దొండా రాజు, దొండా శ్రీను పాల్గొన్నారు.

'మరుగుదొడ్ల వినియోగం పై చైతన్యపరచాలి'


గోడపత్రికను ఆవిష్కరించిన కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గృహ, సామూహిక మరుగుదొడ్ల వినియోగంపై గ్రామీణ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని జిల్లా గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అంతర్జాతీయ మరుగుదొడ్ల దినోత్సవ గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. అంతర్జాతీయ మరుగుదొడ్ల దినోత్సవాన్ని జిల్లాలోని అన్ని గ్రామాల్లో నిర్వహించాలన్నారు. జిల్లా గ్రామీణ కార్యనిర్వాహక ఇంజినీర్ జె.అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక

- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి


ప్రజా వేదికలో అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో శుక్రవారం నిర్వహించిన ప్రజావేదిక ఆయన వినతులను అందుకున్నారు. పోడు భూములు, విద్యుత్, తాగునీరు, రోడ్లు, బస్సు సౌకర్యాలు, దేవాలయాలు, గృహాలు నిర్మించేందుకు స్థలాల కోసం అర్జీలు అందాయి. అర్జీదారులతో ఎమ్మెల్యే ముఖాముఖి మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాడేరు, విశాఖపట్నం, అనకాపల్లి డిపోలకు చెందిన బస్సు సర్వీసులను మాడుగుల మీదుగా నడిపే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే మాడుగుల మీదుగా బస్సులు నడపాలంటే ఎం.కోడూరు గ్రామంలో రోడ్డుకిరువైపులా ఆక్రమణలు తొలగించాల్సి ఉందని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్.సన్యాసిరావు, పట్టణ అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణ, కార్యదర్శి గోపాల్‌వర్మ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణతోనే ఆరోగ్యం: ఎమ్మెల్యే

మాడుగుల రూరల్: పల్లెల్లో పారిశుధ్య నిర్వహణతోనే వ్యాధులు ప్రబలకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. చింతలూరులో పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లకు శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ అందరి బాధ్యత అన్నారు. ప్రజలు ఎక్కడబడితే అక్కడ చెత్తాచెదారం పారేయవద్దని, ఇళ్లకు వచ్చేగ్రీన్ అంబాసిడర్లకు అందిచాలని సూచించారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్లకు నిత్యావసర సరకులు అందించారు. అలాగే శాలువాలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో నాగలక్ష్మి, ఎంపీడీవో అప్పారావు, పంచాయతీ కార్యదర్శి రామయ్య, ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, సర్పంచ్ కె.శకుంతల, కూటమి నాయకులు సన్యాసిరావు, రమేశ్, వరహాల నాయుడు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణకు అందరూ బాధ్యత తీసుకోవాలి

చీడికాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్య వివాహాల నివారణకు అందరూ బాధ్యత తీసుకోవాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం సామాజిక కార్యకర్త పి.మంగ కోరారు. జిల్లా మహిళాభివృద్ధి, బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం చీడికాడ హైస్కూల్, గ్రామ సచివాలయంలో సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశంలో జీవో నంబరు-1, బాల్యవివాహాల వలన వచ్చే ముప్పు గురించి బాలికలపై లైంగిక వేధింపుల గురించి వివరించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామ పరిశుభ్రతకు గ్రీన్ గార్డులే కీలకం

చీడికాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు గ్రీన్‌గార్డులే కీలకమని ఎంపీడీవో కేవీజీ.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లి సచివాలయంలో 'పరిశుభ్రమైన గ్రామం-ఆరోగ్యవంతమైన జీవనం'పై అనే అంశంపై శుక్రవారం గ్రీన్‌గార్డులకు ఒకరోజు శిక్షణ జరిగింది. ఈ శిక్షణలో పలు విషయాలపై మాట్లాడారు. శిక్షణలో డిప్యూటీ ఎంపీడీవో పట్నాల గోపి, పంచాయతీ కార్యదర్శి కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెదనందిపల్లిలో పచ్చదనం-పరిశుభ్రత

దేవరాపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదనందిపల్లిలో ఎంపీడీవో సువర్ణరాజు ఆధ్వర్యంలో శుక్రవారం పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో వీధులను కార్యదర్శులు, సీఆర్పీలు, హరిత రాయబారులు పరిశుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగంచకూడదని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఈ సందర్భంగా ఎంపీడీవో సూచించారు. హరిత మిత్రలు తడి చెత్త, పొడిచెత్త సేకరించడానికి వచ్చినప్పుడు ప్రజలు సహకరించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో కిరణ్ వరప్రసాదు, వీపీవీత్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తే మంచి భవిష్యత్తు: బూడి

చీడికాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులకు మంచి భవిష్యత్తు ఉంటుందని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు భరోసా ఇచ్చారు. మండలంలోని బైలపూడి గ్రామానికి చెందిన వైసీపీ గ్రామ అధ్యక్షులు జాజిమొగ్గల అప్పారావు, ఉపాధ్యక్షులు గొల్లవిల్లి రామకృష్ణలను క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసి మరింత ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గొల్లవిల్లి రాజబాబు, యూత్ అధ్యక్షులు గొల్లవిల్లి సామినాయుడు, నాయకులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రోలుగుంట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎంఈవో జగ్గారావుకు వినతిపత్రం అందించారు. సమాన పనికి సమాన వేతనం, మినిమం ఆఫ్ టైం స్కేల్ అమలు చేయాలన్నారు. పార్ట్‌టైం విధానాన్ని రద్దు చేసి ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలుచేసి వేతనాలను పెంచాలన్నారు. సామాజిక భద్రత పథకాలు అమలు చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ లీవ్‌లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎం.వేణు, త్రిబాబు, శ్రీనివాసరావు, రామచంద్రరావు, నూర్పి, చిరంజీవి, సతీశ్ పాల్గొన్నారు.


ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కొట్నాబిల్లి తారు రోడ్డు అభివృద్ధిపై హర్షం

- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు గిరిజనుల కృతజ్ఞతలు


ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రులకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఆదివాసీలు

రావికమతం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా నరకం చూపిస్తున్న కొట్నాబిల్లి రోడ్డును అభివృద్ధి చేయడంపై గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు నిర్మించిన ఈ రోడ్డును చూపుతూ శుక్రవారం వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇంపాక్ట్ నిధులు రూ.6.98 కోట్లతో 2024లో ఈ రోడ్డు అభివృద్ధి చేయాలని గత వైసీపీ ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసినా నిధులు విడుదల చేయలేదు. దీంతో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులను మధ్యలోని నిలిపేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు చొరవతో కాంట్రాక్టర్ మరలా ఈ రింగ్ రోడ్డును కొట్నాబిల్లి నుంచి చిన పాచిల కాటా వరకూ నిర్మాణం చేశారు. దీంతో ఈఏడు గ్రామాలకు రవాణా కష్టాలు తీరాయని ఆదివాసీలు ఆనందం వ్యక్తం చేశారు.

సీఎం, డిప్యూటీ సీఎం, స్పీకర్ చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న మహిళా రైతులు

గొలుగొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తఎల్లవరం గ్రామానికి చెందిన ఈనాం రైతులకు అన్నదాత సుఖీభవ నగదు జమకావడంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చిత్రపటాలకు శుక్రవారం రైతులు పాలాభిషేకం చేశారు. మండలంలోని కొత్తఎల్లవరం గ్రామంలో సుమారు 340 మంది ఈనాం భూములను సాగు చేసుకుంటున్నారు. దీంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృషితో రైతులకు ఒక్కోక్కరికి ఏడు వేల రూపాయల చొప్పున రైతుల ఖాతాల్లో జమకావడంతో ఆనందం వ్యక్తం చేశారు. దీంతో చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లురాంబాబు, టీడీపీ నాయకులు శెట్టి దొరబాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వేచలంలో గంగమ్మకు హారతులు


వేచలంలో అమ్మవారికి హారతులు ఇవ్వడానికి ఊరేగింపుగా వెళ్తున్న భవానీ భక్తులు

దేవరాపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం అనంతరం పోలిపాడ్యమి సందర్భంగా వేచలం గ్రామంలో శుక్రవారం గంగమ్మకు హారతులు ఇచ్చారు. కోడూరు వెంకటరావు గురుస్వామి ఆధ్వర్యంలో భక్తులు ఊరేగింపు చేసి. అనంతరం శారదా నది ఒడ్డున గంగమ్మకు హారతులు ఇచ్చారు. ఎంపీటీసీ సభ్యురాలు రెడ్డి శ్రీలక్ష్మి, నాయకులు బూరే బాబూరావు, రెడ్డి జగ్గారావు శుక్రవారం పాల్గొన్నారు.

ఏయూ మాజీ వీసీకి జైలు శిక్ష

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ఒకరికి నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. ప్రస్తుతం ఈ వ్యవహారం వర్సిటీలో హాట్ టాపిక్‌గా మారింది. వివరాల్లోకి వెళితే...బోటనీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంట్రాక్టు)గా పనిచేస్తున్న ఎస్‌వీవీఎస్ నూకన్నదొరను అప్పటి ఉన్నతాధికారులు ఆరోపణలు వచ్చాయంటూ విధుల నుంచి తొలగించారు. దీనిపై వర్సిటీ అధికారులు, అప్పటి ప్రభుత్వ పెద్దల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో దొర హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న హైకోర్టు...దొరను ఉద్యోగంలో కొనసాగించాలని 2023లో తీర్పు ఇచ్చింది. అయితే, కోర్టు ఇచ్చిన తీర్పును వర్సిటీ అధికారులు పట్టించుకోలేదు. ఆయన్ను విధుల్లోకి తీసుకోలేదు. తీర్పును అమలు చేయకపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన కోర్టు అప్పటి వైస్ చాన్సలర్‌ను స్వయంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. అయినప్పటికీ కోర్టుకు హాజరుకాకపోవడంతో బెయిల్‌బుల్ వారెంట్‌ను ఈ ఏడాది ఆగస్టులో కోర్టు జారీ చేసింది. కోర్టు ఆర్డర్ అందలేదన్న కారణాలను చూపించి తప్పించుకునే ప్రయత్నం చేసిన విషయాన్ని కోర్టు దృష్టికి బాధితుడు తీసుకువెళ్లడంతో తాజాగా గురువారం జరిగిన వాదనల అనంతరం నెలరోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పును ఇచ్చింది. ఇదిలావుంటే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే బాధితుడైన ఉద్యోగిని విధుల్లోకి తీసుకున్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి హాకీ పోటీలు


రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు సిద్ధమైన మైదానం

నక్కపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్ర స్థాయి బాల, బాలికల హాకీ పోటీలు శనివారం నుంచి 24వ తేదీ వరకు స్థానిక బీఎస్ హాకీ క్లబ్ మైదానంలో జరుగుతాయని క్లబ్ వ్యవస్థాపకులు బలిరెడ్డి సూరిబాబు, సెక్రటరీ కొల్నాటి తాతాజీ తెలిపారు. ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ అధికారుల పర్యవేక్షణలో జరిగే ఈ పోటీలకు మైదానాన్ని సిద్ధం చేశామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాజట్లు నక్కపల్లి చేరుకున్నాయని, వారికి వసతి సదుపాయాలను ఎస్‌జీఎస్ అధికారులు కల్పించారని పేర్కొన్నారు.

రూ.8 వేల కోట్లతో 75 తాగునీటి పథకాలు

» రూ.2,575 కోట్లతో మురుగునీటి శుద్ధీకరణ పనులు
» మునిసిపల్ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ఈఎన్‌సీ వెల్లడి


నర్సీపట్నం పెద్ద చెరువును పరిశీలిస్తున్న ప్రజారోగ్య విభాగం ఈఎన్‌సీ ప్రభాకరరావు, ఇతర అధికారులు

నర్సీపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) అమృత్ 2.0 పథకంలో భాగంగా రాష్ట్రంలో రూ.8 వేల కోట్లతో 75 తాగునీటి పథకాల నిర్మాణం చేపట్టనున్నట్టు పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ఈఎన్‌సీ ప్రభాకరరావు తెలిపారు. ఆయన శుక్రవారం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మునిసిపాలిటీలో సమగ్ర మంచినీటి పథకం వనరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటి పథకాలకు త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. పురపాలక సంఘాలు, కార్పొరేషన్ల పరిధిలో రూ.2,575 కోట్లతో 25 మురుగునీటి శుద్ధి పథకాలకు టెండర్ల ప్రక్రియ పూర్తిచేశామని తెలిపారు. అలాగే పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి (యూఐడీఎఫ్)లో రూ.1500 కోట్లతో 17 ప్రాజెక్టుల నిర్మాణానికి టెండర్లు పిలిచామని తెలిపారు. డిసెంబరు నెలాఖరులోగా పరిపాలన అనుమతులు ప్రక్రియ పూర్తిచేసి కొత్త సంవత్సరంలో పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

సమగ్ర మంచినీటి పథకానికి టెండర్లు ఖరారు

నర్సీపట్నం మునిసిపాలిటీలో సమగ్ర మంచినీటి పథకం నిర్మాణానికి రూ.185.59 కోట్లతో నాలుగు ప్యాకేజీల కింద టెండర్లు ఖరారు అయ్యాయని ప్రభాకరావు తెలిపారు. ఎండపల్లి వద్ద ఏలేరు కాలువ నుంచి నీటిని తీసుకుంటామని, పెద్ద చెరువులో సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నిర్మాణానికి ఇరిగేషన్ శాఖ అనుమతులు ఇచ్చిందని తెలిపారు. పెద్ద చెరువు ఆయకట్టు రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మించునున్న చేయనున్న నర్సీపట్నం పెద్ద చెరువును, అంతకుముందు ఎండపల్లి వెళ్లి ఏలేరు కాలువను పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఈలు నగేశ్‌బాబు, కామేశ్వరరావు, ఈఈ దక్షిణామూర్తి, డీఈఈ మహేశ్, కమిషనర్ సురేంద్ర వున్నారు.

గంజాయి స్మగ్లర్ల బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

నుంచి తప్పించుకున్నారు. స్మగ్లర్ల కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగిపోయింది. ఇందులో వున్న ఇద్దరు పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కారులో వున్న 240 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

ఏజెన్సీ ప్రాంతం నుంచి కారులో మైదాన ప్రాంతానికి గంజాయి రవాణా అవుతున్నట్టు శుక్రవారం సాయంత్రం చోడవరం పోలీసులకు సమాచారం అందింది. దీంతో స్టేషన్ సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో వడ్డాది వైపు నుంచి వస్తున్న కారును డ్రైవర్ ఆపకుండా ముందుకు పోనిచ్చారు. పోలీసులు వెంటనే అప్రమత్తమై కారును వెంబడించారు. దీంతో కారు డ్రైవర్ వేగాన్ని మరింత పెంచాడు. పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో అటవీ శాఖ కార్యాలయం వద్ద రోడ్డుపై వెళుతున్న ఆటోను, మోటారు బైక్‌ను ఢీకొట్టాడు. అనంతరం రోడ్డు పక్కన ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొని కారు ఆగిపోయింది. బైక్‌పై వెళుతున్న దుడ్డుపాలెం గ్రామానికి చెందిన భార్యాభర్తలు కూర్మదాసు గోవింద, చిన్నమ్మలు తలకు గాయాలయ్యాయి. విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన అనంతరం కారు ఆగిపోయింది. అందులోని ఇద్దరు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వెంటాడి పట్టుకున్నారు. కారులో సోదా చేయగా 240 కిలోల గంజాయి లభ్యమైంది. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సీఐ బి.అప్పలరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

» గందరగోళం లేకుండా రీసర్వే జరగాలి
» ఆ ప్రక్రియ పూర్తయిన భూములకు మ్యుటేషన్ చేసేలా చర్యలు తీసుకోవాలి
» అధికారులకు రాష్ట్ర శాసనసభాపక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్ రఘురామకృష్ణరాజు నిర్దేశం
» జమాబందీ విధానాన్ని పునఃప్రారంభించాలన్న కమిటీ సభ్యుడు, ఎమ్మెల్యే కొణతాల
» జిరాయితీ భూములను 22-ఏ జాబితా నుంచి తొలగించాలని కోరిన ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు


సమీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర శాసనసభాపక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్ రఘురామకృష్ణరాజు. చిత్రంలో సభ్యులు కొణతాల రామకృష్ణ, పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, కలెక్టర్ హరేంధిరప్రసాద్ తదితరులు ఉన్నారు.

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పదేపదే తలెత్తుతున్న భూసంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా సమగ్ర ప్రణాళికతో కూడిన కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర శాసనసభాపక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఫిర్యాదుల కమిటీ అధికారులతో నిర్వహించిన సమీక్షకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ సమగ్ర భూసర్వే, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, రికార్డుల నిర్వహణ, సరిహద్దుల గుర్తింపు అభ్యంతరాల స్వీకరణ, తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా చేపడుతున్న సమగ్ర భూ రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని, లోపాలు తలెత్తకుండా గందరగోళం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రీసర్వే చేయనున్న గ్రామాల్లో ముందుగా దండోరా వేయించి గ్రామ సభలు విధిగా నిర్వహించి ప్రక్రియను సజావుగా చేపట్టాలని స్పష్టంచేశారు. రైతుల సమక్షంలో ప్రక్రియ మొత్తం సాగాలని, అభ్యంతరాల స్వీకరణకు వీలుగా మొబైల్ మేజిస్ట్రేట్ బృందాలు అందుబాటులో ఉండాలన్నారు. అశాంతికి, గందరగోళానికి తావులేకుండా రీసర్వే చేయాలని, ఒకవేళ వివాదాలు తలెత్తితే ఇరుపక్షాల సమక్షంలో పరిష్కార చర్యలు చేపట్టాలని, అనివార్యకారణాలతో ఒక వర్గం రాకపోతే మరో అవకాశం ఇవ్వాలని, అప్పటికీ రాకపోతే సుమోటోగా తీసుకుని నిబంధనలకు అనుగుణంగా అధికారులు నిర్ణయం తీసుకోవచ్చునని స్పష్టంచేశారు. రీసర్వే అయిన భూములకు మ్యుటేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల నుంచి వచ్చే అభ్యంతరాల పరిష్కారానికి గడువు రెండేళ్లకు పెంచాలని కమిటీ అభిప్రాయపడిందని రఘురామకృష్ణరాజు అన్నారు. దీన్ని సీసీఎల్ఏ దృష్టికి తీసుకువెళ్లి ఆచరణలో పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. కమిటీ ప్రతిపాదించిన అంశాలలో దీన్ని ప్రధానంగా చేర్చాలని అధికారులకు సూచించారు. అనకాపల్లి ఎమ్మెల్యే, కమిటీ సభ్యుడు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, రైతుల సమస్యలు పరిష్కారం కోసం జిల్లా స్థాయి అధికారి నుంచి వీఆర్వో వరకు ఏడాదికి ఒకసారి గ్రామాల్లో అందుబాటులో ఉండేలా జమాబందీ విధానాన్ని పునఃప్రవేశపెట్టాలని సూచించారు. భూఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాన్ని సవరించాలన్నారు. విశాఖ ఉత్తర ఎమ్మెల్యే, కమిటీ సభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ భూములు రీసర్వే చేసినప్పుడు కొన్నిచోట్ల జిరాయితీ భూములు 22-ఎలో పెట్టారని పేర్కొంటూ అటువంటి వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలన్నారు. గంభీరంలో సర్వేనంబరు 228-4లో ఒక వ్యక్తి కొనుగోలు చేసిన జిరాయితీ భూమిని 22-ఎలో పెట్టారని పేర్కొంటూ ఇటువంటివి చాలా ఉన్నాయన్నారు. గాజువాక ఎమ్మెల్యే, కమిటీ సభ్యుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కుకర్మాగారం పరిధిలో ఆర్.కార్డులు పొందిన వారిలో 472 మంది ఎటువంటి ప్రయోజనాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. స్థానికంగా ఉన్న విమల విద్యాలయం పరిస్థితిని ప్రస్తావించి సమస్య పరిష్కరించాలన్నారు. ఉక్కు కర్మాగారం పరిధిలో ఉన్న బస్ డిపో, గంగవరం మత్స్యకారులకు జెట్టీ నిర్మాణం, ఏపీఐఐసీ లేఅవుట్, అపెరల్ పార్కును 22-ఎ నుంచి తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షా సమావేశంలో శాసనసభ డిప్యూటీ సెక్రటరీ రాజ్‌కుమార్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, సర్వే విభాగం డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఆర్డీవోలు సంగీత్‌మాథుర్, సుధాసాగర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెళ్లి సందడి
నేటి నుంచి 26వ తేదీ వరకు రికార్డుస్థాయిలో వివాహాలు

» గృహప్రవేశాలు, ఇతర శుభకార్యాలు సైతం..
» 28 నుంచి ఫిబ్రవరి 14 వరకు శుక్ర మౌఢ్యమి
» రెండున్నర నెలలపాటు శుభముహూర్తాలు నిల్



నక్కపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ముగిసింది. శుక్రవారం మార్గశిరమాసం ప్రవేశించింది. మరో ఆరు రోజుల్లో శుక్ర మౌఢ్యమి ప్రారంభం కానున్నది. 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 14వ తేదీన వరకు శుభముహూర్తాలు లేవు. దీంతో రానున్న ఐదు రోజుల్లో పెద్ద ఎత్తున వివాహాలు, గృహప్రవేశాలు, ఇతర శుభకార్యాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మార్గశిరం రెండో రోజైన శనివారం నుంచి అద్భుతమైన ముహూర్తాలు వున్నాయని పండితులు, పురోహితులు చెబుతున్నారు. 26వ తేదీ వరకు వివాహాలు, నిశ్చయతాంబూలాలు, శంకుస్థాపనలు, నూతన గృహప్రవేశాలు వంటి శుభకార్యాలు అధికంగా జరగనున్నాయి. 22, 26 తేదీల్లో రికార్డుస్థాయిలో పెళ్లిళ్లు జరగనున్నాయి. 27న వివాహ ముహూర్తాలు అంతగా లేనప్పటికీ గృహప్రవేశాలు, నిశ్చయతాంబూలాలకు ముహూర్తాలు వున్నాయి. మాఘమాసం బహుళ ద్వాదశి (ఫిబ్రవరి 14) వరకు శుక్ర మౌఢ్యమి వున్నందున హైందవ సంప్రదాయాన్ని పాటించే వారు వివాహాలు, గృహ ప్రవేశాలు వంటివి చేసుకోరని పంచాంగకర్తలు చెబుతున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

» కలెక్టర్ విజయకృష్ణన్


ఉద్యోగితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రతి నెల మూడో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రభుత్వ ఉద్యోగులు కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. ప్రతి ఒక్కరి సమస్యను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. న్యాయమైన, పరిష్కరించడానికి అవకాశం వున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక గ్రీవెన్స్‌లో పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగుల నుంచి తొమ్మిది అర్జీలు, రెవెన్యూ శాఖ నుంచి మూడు అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో పీజీఆర్ఎస్ సమన్వయ అధికారి ఎస్.సుబ్బలక్ష్మి, కలెక్టరేట్ ఏవో విజయ్‌కుమార్, పీజీఆర్ఎస్ సెల్ పర్యవేక్షకుడు సురేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పెదగొల్లలపాలెంలో గెడ్డవాగు కబ్జా

» దర్గాగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
» హెచ్చరిక బోర్డులు పెట్టినా.. బేఖాతరు


గెడ్డవాగును ఆక్రమించి చేపట్టిన నిర్మాణం

సబ్బవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగొల్లలపాలెంలో గెడ్డవాగును ఆక్రమించి దర్గాగా నిర్మాణం చేపట్టారు. రెవెన్యూ అధికారులు ఇక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసినా.. కబ్జాదారుడు ఖాతరు చేయడంలేదు. హెచ్చరిక బోర్డు సాక్షిగా భవన నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ, గెడ్డ స్థలంలో నిర్మాణం చేపట్టడం అధికారుల మెతక వైఖరి కారణమని స్థానికులు అంటున్నారు. వివరాల్లోకి వెళితే...

పెదగొల్లలపాలెం సర్వే నంబరు 249లో గ్రామానికి అనుకొని సుమారు 60 సెంట్లు గెడ్డవాగు ప్రభుత్వ భూమి ఉంది. ఐదేళ్ల క్రితం వైసీపీ హయాంలో స్థానిక నేతల సహకారంతో కొంతమంది ఈ భూమిని ఆక్రమించుకున్నారు. గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి తహసీల్దార్ కె.రమాదేవి ఆదేశాలతో ఆర్ఐ రమణ, వీఆర్వో పూడి శేషు సర్వే చేయించి, గెడ్డవాగు అని తేలడంతో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అదే వ్యక్తి మరోసారి ఆక్రమణకు పాల్పడ్డాడు. తహశీల్దార్ చిన్నికృష్ణ ఆదేశాలతో ఆర్ఐ వీరయ్య, వీఆర్వో దేముడుబాబు ఆరు నెలల్లో మూడుసార్లు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయినాసరే ఆక్రమణను కొనసాగిస్తుండడంతో రెవెన్యూ అధికారులు క్రిమినల్ కేసులు పెట్టారు. తాజాగా గెడ్డవాగులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం పిల్లర్ల పనులు చేపట్టారు. దీనిపై తహశీల్దార్ చిన్నికృష్ణను వివరణ కోరగా.. మూడు సెంట్లకు సంబంధించి డాక్యుమెంట్ ఉందని ఆక్రమణదారుడు చెబుతున్నాడని, అయినప్పటికీ నిర్మాణం ఆపాలని చెప్పామన్నారు. మరోసారి సర్వే చేసి గెడ్డవాగు అయితే నిర్మాణం తొలగిస్తామన్నారు.

ఎకరాకు రూ.9 లక్షలు?

... 5వ పేజీ తరువాయి

భూముల్లో చాలా కాలం నుంచి రైతులు మామిడి, జీడిమామిడి తోటలు సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ అయిన్న అయ్యన్నపాత్రుడు కృషితో కూటమి ప్రభుత్వం రాచపల్లి ప్రాంతాన్ని పారిశ్రామిక్ హబ్‌కు అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. సుమారు 410 ఎకరాలను 469 మంది చిన్న, సన్నకారు రైతులు సాగుచేసుకుంటున్నట్టు అధికారులు గుర్తించారు. ఇక్కడ రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం ఎకరా రూ.18 లక్షలు వుంది. సాగుదారులైన రైతులకు పట్టాలు లేకపోవడంతో రిజిస్ట్రేషన్ విలువలో 50 శాతం సొమ్మును పరిహారంగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లెక్కన ఎకరాకు రూ.9 లక్షల చొప్పున పరిహారం అందే అవకాశం వుంది. ఇదే విషయాన్ని ఇటీవల స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. రెవెన్యూ అధికారులు వారం రోజుల్లో గ్రామసభ నిర్వహించి సాగుదారుల జాబితాను ప్రకటిస్తారు. రైతుల జాబితాలను శుక్రవారం కలెక్టర్‌కు అందజేసినట్టు సమాచారం.

కౌలు రైతుల నిరాశ

... 5వ పేజీ తరువాయి

జారీ చేస్తున్న సీసీఆర్ కార్డులకు ఎక్కడా పొంతన వుండడంలేదు. వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో సుమారు 80 వేల మంది కౌలు రైతులు వున్నారు. కానీ ఏడాది ఆరు వేల మంది రైతులకు సీసీఆర్ కార్డులు జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇంతవరకు 4,987 మందికి మాత్రమే కార్డులు జారీ అయ్యాయి. వీటిని పొందిన వారికి పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల సాయం అందలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకాల కింద రెండు విడతల్లో ఒక్కో రైతులకు రూ.14 వేలు అందాయి. కానీ కౌలు రైతులకు ఒక్కసారి కూడా పెట్టుబడి సాయం అందలేదు. వ్యవసాయ శాఖ అధికారుల తీరుపై రైతు సంఘాల నేతలు మండిపడుతున్నారు. జిల్లాలో వున్న కౌలు రైతులందరికీ సీసీఆర్ కార్డులు ఇవ్వాలని, అన్ని రకాల రాయితీలు, పథకాలు వర్తింపజేయాలని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పలరాజు డిమాండ్ చేస్తున్నారు.

క్రైం... crime news

25 కిలోల గంజాయితో ఆరుగురి అరెస్టు


పట్టుబడిన గంజాయి నిందితులలతో కొయ్యూరు ఎస్ఐ, సిబ్బంది

కొయ్యూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిపాలెం కూడలిలో శుక్రవారం 25 కిలోల గంజాయితో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ కిశోర్‌వర్మ తెలిపారు. ఆయన అందజేసిన వివరాలిలా ఉన్నాయి. చీడిపాలెం కూడలి వద్ద శుక్రవారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. చిత్రకొండ నుంచి రెండు ద్విచక్ర వాహనాలపై వస్తున్న వ్యక్తులను తనిఖీ చేశారు. వారి వద్ద 25 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ సందర్భంగా జీకే వీధి మండలం ఆర్‌వీ నగర్‌కు చెందిన గొల్లూరి నాగు, మత్రిపాలెంకు చెందిన గెమ్మెలి రాజేష్, కర్ణాటక రాష్ట్రం అరుణాచలం మల్లూరు పట్టణం శక్తినగర్‌కు చెందిన శరవన్, మల్లూరు ఆదర్శనగర్‌కు చెందిన శంకర్, మల్కన్‌గిరికి చెందిన పబిత్రఖరా, మల్లూరు కుంబరపేట్‌కు చెందిన సీఆర్ సురేష్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు ద్విచక్రవాహనాలతో పాటు ఐదు సెల్‌ఫోన్‌లను సీజ్ చేసినట్టు ఎస్ఐ కిశోర్‌వర్మ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వివాహితను దూషించిన వ్యక్తిపై కేసు

గొలుగొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళను అసభ్యకరంగా దూషించడంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. మండలంలో చీడిగుమ్మల గ్రామానికి చెందిన మొండెం భాను అనే వివాహితను అదే గ్రామానికి చెందిన కామిరెడ్డి రామకృష్ణ అసభ్యకర పదజాలంతో దూషించినట్టు ఫిర్యాదు అందిందని చెప్పారు. భాను ఇంటిపైకి వెళ్లి చంపుతానని బెదిరించినట్టు పేర్కొన్నారని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని ఎస్ఐ రామారావు తెలిపారు.

బంగారం చోరీ కేసులో నిందితుడి అరెస్టు

పరవాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగారు పుస్తెలతాడు చోరీ కేసులో నిందితుడుని అరెస్టు చేసినట్టు సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. శుక్రవారం మీడియాకు వెల్లడించిన వివరాలిలా వున్నాయి. లంకెలపాలేనికి చెందిన ఇరోతి కన్నమ్మ, గంగరాజు ఆగస్టు 16వ తేదీ రాత్రి పది గంటల సమయంలో స్థానిక రైల్వే బ్రిడ్జి కింద నుంచి వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో వున్న రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడును తెంచుకొని పారిపోయారు. దీనిపై బాధితులు అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు బుచ్చెయ్యపేట మండలం సీతయ్యపేటకు చెందిన గుర్రం అప్పారావు, మంత్రిపాలెం గ్రామానికి చెందిన ఎం.శ్రీను చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. అప్పారావును శుక్రవారం మధ్యాహ్నం గొర్లివానిపాలెం వద్ద ఎట్టుకుని రెండున్నర తులాల బంగారం పుస్తెలతాడును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రియురాలి కోసం ఆత్మహత్యాయత్నం

కలిగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రియురాలిని వదిలి ఉండలేనంటూ ఓ యువకుడు కలిగిరి పోలీస్‌స్టేషన్ ఎదుట శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని ఏపినాపి గ్రామానికి చెందిన కోటపాటి విష్ణువర్ధన్‌కు ఎనిమిదేళ్ల క్రితం వివాహమై, ఓ పాప కూడా ఉంది. అనకాపల్లి సమీపంలో ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్న విష్ణువర్ధన్‌కు మరో మహిళ పరిచయమై, వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం తెలియడంతో భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. ఇటీవల విష్ణువర్ధన్ తన ప్రియురాలితో కలిసి అనకాపల్లి నుంచి వచ్చి ప్రకాశం జిల్లా పామూరులోని ఓ లాడ్జిలో ఉంటున్నాడు. ఇది తెలుసుకున్న భార్య పోలీసుల సాయంతో వారిని కలిగిరి స్టేషన్‌కు తీసుకువచ్చారు. తనకు భార్య వద్దని, తాను ప్రియురాలి వద్దే ఉంటానంటూ ఆస్తి మొత్తం భార్యకు చెందేలా కాగితాలు రాసిచ్చేశాడు. అయితే, తమ కుమార్తె అదృశ్యమైనట్లు యువతి (ప్రియురాలు) తల్లిదండ్రులు ఈ నెల 16న అనకాపల్లిలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కలిగిరికి వచ్చి యువతిని తీసుకువెళ్లే ప్రయత్నంచేశారు. ఆమెను తీసుకెళితే తాను చనిపోతానంటూ స్టేషన్ ఎదుట పురుగుమందు తాగేశాడు. వెంటనే భార్య ఆయన్ను స్థానికంగా ఉన్న ఓ ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్స చేయించింది.

తాకట్టు బంగారంలో చిలక్కొట్టుడు!

... 5వ పేజీ తరువాయి

చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నాకు ముందున్న వారి హయాంలో జరిగింది

కె.స్వామినాయుడు, బ్రాంచి మేనేజర్

బ్యాంకులో వెలుగుల దొరబాబు తాకట్టు పెట్టిన వస్తువుల్లో తగ్గిన బంగారం మేరకు ఆయనకు తిరిగి ఇచ్చాం. బ్యాంకులో తాము తాకట్టుపెట్టిన బంగారంలో తగ్గుదల వచ్చిందని ఇప్పటివరకూ ఎనిమిది మంది వరకూ ఫిర్యాదు చేశారు. వారందరి సమస్య పరిష్కారం అయింది. నేను ఇటీవల విధుల్లో చేరాను. నాకు ముందున్న వారి హయాంలో ఇది జరిగింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో అప్రైజర్‌ను ఇక్కడ నుంచి బదిలీ చేశారు.

అడుగుకో అతుకు.. గజానికో గొయ్యి!

... 5వ పేజీ తరువాయి


బుచ్చెయ్యపేట మండలం పొట్టిదొరపాలెం వద్ద ఆనవాళ్లు లేని తారురోడ్డు

గ్రామాల వద్ద పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వర్షం కురిస్తే నీరు చేరి పంట కుంటలను తలపిస్తున్నాయి.

- కశింకోట మండలం తాళ్లపాలెం హైవే జంక్షన్ నర్సీపట్నం వెళ్లే రోడ్డులో కశింకోట మండల పరిధిలో పలుచోట్ల గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల పూడ్చినప్పటికీ మొంథా తుఫాన్ సమయంలో కురిసిన వర్షాలతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది.
- ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డు నుంచి నర్సీపట్నం వెళ్లే రోడ్డులో ఇందేశమ్మవాక ప్రాంతంలో రహదారిపై భారీ గోతులు ఏర్పడ్డాయి. ఐదారు నెలల క్రితం బ్లాక్ మెటల్‌తో ఈ గోతులను కప్పగా.. వర్షాలతో మెటల్ కొట్టుకుపోయి గోతులు మళ్లీ ప్రత్యక్షం అయ్యాయి.

నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభం

నందమూరి సాంబశివరావు, ఎస్ఈ, ఆర్అండ్‌బీ

గత నెలలో తుఫాన్ సమయంలో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లతో పాటు, మిగిలిన రోడ్ల మరమ్మతులు, అభివృద్ధి పనులకు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. బీఎస్ రోడ్డు పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టరుతో చర్చలు జరిపాం. ప్రస్తుతం ఈ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయి. ఒకటి, రెండు రోజుల్లో వేగం పుంజుకుంటాయి.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	103.00
లైవ్ ధర	123.00
విత్ స్కిన్	216.00
స్కిన్ లెస్	226.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	635
విజయనగరం	639
శ్రీకాకుళం	639